ఈనాటి

PRGI-NO-APTEL/25/A2739

# తెలుగోడు

EENAATI TELUGODU... Telugu Daily

https://www.eenaatitelugodu.com




సంపుటి-1 | సంచిక - 173 | మంగళవారం 24 మార్చి 2026 | పేజీలు - 6 | వెల - రూ.. 5

Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati

### యుద్ధంతో భారత్‌కు ఎన్నో

# సవాళ్లు

**ఆందోళనకరంగా పశ్చిమాసియా పరిస్థితి...**

**లోక్‌సభలో ప్రధాని మోదీ**



**న్యూ ఢిల్లీ (తెలుగోడు), మార్చి 23 :**

పశ్చిమాసియాలో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. సోమవారం ఆయన లోక్‌సభలో మధ్యప్రాచ్యంలో యుద్ధం గురించి ప్రసంగించారు. మూడు వారాలుగా యుద్ధం కొనసాగుతోందన్న ప్రధాని మోదీ.. భారత్ ఇంధన అవసరాలను పశ్చిమాసియా తీరుస్తోందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ యుద్ధం భారత్‌కు ఎన్నో సవాళ్లు తీసుకొచ్చిందని మోదీ అన్నారు. ప్రజలపై యుద్ధం తీవ్ర ప్రభావం చూపిస్తోందని కూడా ప్రధాని మోదీ వెల్లడించారు. పశ్చిమాసియాలో కోటి మందికిపైగా భారతీయులు ఉన్నారని, గల్ఫ్‌లో ఉన్న భారతీయుల రక్షణకు చర్యలు చేపట్టామని ప్రధాని మోదీ లోక్ సభలో చెప్పారు. 24 గంటలూ కంట్రోల్ రూమ్స్, హెల్ప్‌లైన్స్ ఏర్పాటు చేశామని, 3.75 లక్షల మంది భారతీయులు క్షేమంగా వెనక్కి వచ్చారని మోదీ తెలిపారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ కొరత లేకుండా చర్యలు చేపట్టామన్నారు. పశ్చిమాసియా పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఆయిల్, గ్యాస్, ఎరువుల సరఫరాకు హోర్ముజ్ జలసంధి కీలకమని మోదీ (మిగతా 2లో)



## పారిశ్రామిక ప్రగతి దిశగా

# మరో అడుగు

- లక్ష మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగావకాశాలు..
- రెండు దశల్లో 17.8 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యం..
- 2028 నాటికి తొలి దశ ఉత్పత్తి, 2030 నాటికి బ్లాస్ట్ ఫర్నేస్‌లు...
- ఉత్తరాంధ్రను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యం..
- పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా గుర్తింపు..
- శంకుస్థాపనలో సిఎం చంద్రబాబు, డికె కుమార స్వామి

**అనకాపల్లి (తెలుగోడు), మార్చి 23 :**

ఏపీ పారిశ్రామిక ప్రగతి దిశగా మరో అడుగు వేసింది. ప్రపంచంలోనే అగ్రగామి స్టీల్ కంపెనీ ఆర్సెలార్ మిత్తల్, నిప్పాన్ స్టీల్ ఇండియా ఉక్కు కర్మాగారానికి కేంద్ర మంత్రులతో కలిసి, ముఖ్యమంత్రి చంద్రబాబు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా పాయకరావుపేట సమీపంలో భారీ ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపనతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి నూతన దశ ప్రారంభమైంది. తక్కువ సమయంలోనే అనుమతులు, భూసేకరణ పూర్తి చేసి పరిశ్రమను స్థాపించడం రాష్ట్ర పారిశ్రామిక విధానానికి నిదర్శనంగా నిలిచింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా లక్ష మంది యువతకు ప్రత్యక్ష, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.రెండు దశల్లో నిర్మితమయ్యే ఈ ఉక్కు పరిశ్రమ ద్వారా సంవత్సరానికి 17.8 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పరిశ్రమతో పాటు స్టీల్ సిటీగా అనకాపల్లిని అభివృద్ధి చేయాలని సంకల్పించారు. దీనికి అనుబంధంగా 11,198 కోట్ల వ్యయంతో క్యాప్టివ్ పోర్టు నిర్మాణం చేపట్టనున్నారు.2028 నాటికి తొలి దశ ఉత్పత్తి ప్రారంభించేందుకు కార్యాచరణ రూపొందించగా, 2030 నాటికి రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు పూర్తి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. పరిశ్రమకు అనుసంధానంగా జాతీయ రహదారికి 4 లేన్ల రహదారి, ముడి ఇనుము సరఫరా కోసం పైప్‌లైన్ నిర్మాణం చేపట్టనున్నారు.ఈ ప్రాజెక్ట్ వల్ల కేవలం ఉక్కు ఉత్పత్తి మాత్రమే కాకుండా విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల ద్వారా ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక 2లో


# యుద్ధం ఆగింది

**48 గంటల అల్టిమేటానికి ముందే వ్యూహం మార్పు..**

**ఐదు రోజుల కాల్పుల విరమణకు ఆదేశం...**

**శాశ్వత శాంతి కాదన్న హెచ్చరిక..**

**హోర్ముజ్ జలసంధి చర్చలే కీలకం... ట్రంప్..**



**వాషింగ్టన్ (తెలుగోడు), మార్చి 23 :**

ప్రపంచాన్ని వణికించిన అమెరికా-ఇరాన్ ఉద్రిక్తత ఒక్కసారిగా చల్లబడింది. ఇరాన్‌లోని కీలక విద్యుత్ ప్లాంట్లపై దాడులకు ఇచ్చిన 48 గంటల గడువు ముగియకముందే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన వ్యూహాన్ని మార్చుకున్నారు. సైనిక చర్యలను తాత్కాలికంగా వాయిదా వేస్తూ, దౌత్యపరమైన చర్చలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రకటించారు.ఇరు దేశాల మధ్య గత రెండు రోజులుగా రహస్యంగా జరిగిన చర్చలు ఫలించాయని వెల్లడిస్తూ, రాబోయే ఐదు రోజుల పాటు ఇరాన్ విద్యుత్ ప్లాంట్లు, ఇంధన మౌలిక సదుపాయాలపై ఎలాంటి దాడులు చేయొద్దని ఆదేశించారు. ఈతాత్కాలిక (మిగతా 2లో)

## ట్రంప్ మాటలు నమ్మొద్దు

# యుద్ధం ఆగలేదు

**విరామం ప్రకటన ఖండించిన ఇరాన్**



**టెహ్రాన్ (తెలుగోడు), మార్చి 23 :**

యుద్ధం ప్రస్తుతానికి ఆగిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఇరాన్ ఖండించింది. అమెరికాతో ఎలాంటి ప్రత్యక్ష లేదా పరోక్ష చర్చలు జరగలేదని స్పష్టం చేస్తూ, యుద్ధం కొనసాగుతూనే ఉందని పేర్కొంది.ఈ పరిణామాలపై అంతర్జాతీయ ఇంధన సంస్థ అధిపతి ఫతీ బిరోల్ కూడా స్పందించారు. ప్రస్తుత పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారిందని, గత శతాబ్దంలో జరిగిన ఇంధన సంక్షోభాల కంటే ఇది తీవ్రమైందని హెచ్చరించారు. పరిస్థితులు అదుపులోకి రావాలంటే హార్మూజ్ జలసంధి తిరిగి ప్రారంభం కావాల్సిన అవసరం ఉందని సూచించారు. ఇదిలా ఉండగా ఇజ్రాయెల్ మాత్రం (మిగతా 2లో)

## లోకేష్.. ప్రజాదర్బార్‌లో

# వినతుల వెల్లువ

**84వ రోజు విశాఖలో ప్రజా దర్బార్..ప్రభుత్వం అండగా వుంటుందని మంత్రి హామీ**



**విశాఖపట్నం (తెలుగోడు), మార్చి 23 :**

రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమం 84వ రోజుకు చేరుకుంది. సోమవారం విశాఖపట్నంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ వర్గాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను నిశితంగా విన్న మంత్రి వాటిని పరిశీలించి త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ప్రజల సమస్యలను నేరుగా విని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలనే లక్ష్యంతో ప్రజాదర్బార్ (మిగతా 2లో)

## ఐకానిక్ టవర్‌గా

# అసెంబ్లీ నిర్మాణం



**అమరావతి (తెలుగోడు), మార్చి 23 :**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులపై రాష్ట్ర మున్సిపల్, పరిపాలన శాఖ మంత్రి పొంగూరు నారాయణ కీలక అప్‌డేట్స్ ఇచ్చారు. అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్ టవర్లను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఐకానిక్ కట్టడాలుగా నిర్మిస్తున్నామని స్పష్టం చేశారు. ఏపీ రాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా నిర్మిస్తున్న ఐకానిక్ భవనాల విశిష్టతను, నిధుల సమీకరణను మంత్రి నారాయణ వివరించారు. అమరావతి అసెంబ్లీ భవనాన్ని 250 మీటర్ల ఎత్తులో నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ భవనంపైకి ప్రజలు వెళ్లి మొత్తం అమరావతి నగరాన్ని వీక్షించేలా (మిగతా 2లో)

## పీజీ సీట్ల కౌన్సిలింగ్‌పై స్పష్టత కోరిన

# సుప్రీం ధర్మాసనం

**స్పందించని జాతీయ వైద్య కమిషన్‌పై**



**విశాఖపట్నం (తెలుగోడు), మార్చి 23 :**

తెలుగు రాష్ట్రాల్లో పీజీ మెడికల్ సీట్ల భర్తీ కౌన్సెలింగ్ పొడిగింపుపై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. కౌన్సెలింగ్ గడువు పొడిగింపుకు అనుమతి ఇవ్వకపోవడంపై వివరణ ఇవ్వాలని జాతీయ వైద్య కమిషన్‌కు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థులు పీజీ కోర్సుల్లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని, ఖాళీగా ఉన్న సీట్లు వృథా కాకుండా చూడాలని ధర్మాసనం సూచించింది. ఈ వ్యవహారంపై మరింత విచారణను (మిగతా 2లో)

## మోడీకి పవన్‌కళ్యాన్

# అభినందనలు



**అమరావతి (తెలుగోడు), మార్చి 23 :**

డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. ప్రధాని నరేంద్ర మోడీకి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రభుత్వ అధిపతిగా నిరవధికంగా 8,931 రోజుల సేవ పూర్తి చేసిన సందర్భంగా ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రారంభమైన నరేంద్ర మోడీ రాజకీయ ప్రయాణం, భారత ప్రధానిగా కొనసాగుతూ దేశానికి విశేష సేవలు అందించిందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పదవిలో గడిపిన కాలం మాత్రమే కాకుండా, అచంచల సంకల్పం, అలసటలేని కృషి, దేశ సేవకు అంకితమైన జీవితం ప్రధాని మోడీని ప్రత్యేక నాయకుడిగా నిలబెట్టాయని ఆయన అభిప్రాయపడ్డారు పవన్ కల్యాణ్.. 'గ్రాస్ రూట్ స్థాయి నుంచి గ్లోబల్ స్థాయికి దేశాన్ని నడిపిస్తూ 'నేషన్ ఫస్ట్' సిద్ధాంతంతో పాలనకు కొత్త నిర్వచనం ఇచ్చారు' అని ప్రధాని మోడీకి మరింత ఆరోగ్యం, శక్తి కలగాలని ఆకాంక్షిస్తూ జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు..

## తగ్గిన వెండి

# బంగారం ధరలు

**హైదరాబాద్(తెలుగోడు), మార్చి 23 :**

అమెరికా-ఇరాన్ మధ్య దాడులు ముదురుతుండటం, వస్తువుల ధరలు పెరుగుతాయనే భయం, ప్రపంచవ్యాప్తంగా వడ్డీ రేట్లు పెరుగుతాయన్న ఆందోళనల వల్ల ప్రపంచ మార్కెట్లు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. దింతో అంతర్జాతీయంగా బంగారం, వెండి ధరలు భారీగా పడిపోయాయి. సోమవారం 1 గ్రాము 24 క్యారెట్ల బంగారం ధర రూ.595 తగ్గి రూ.14,002, 22క్యారెట్ల ధర రూ. 545 తగ్గి రూ. 12,835, 18 క్యారెట్ల ధర రూ.446 తగ్గి రూ.10,502. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.5,950 తగ్గి రూ.1,40,020, 22 క్యారెట్ల బంగారం ధర రూ.5,450 తగ్గి రూ.1,28,350, 18 క్యారెట్ల బంగారం ధర రూ.4,460 తగ్గి రూ.1,05,020 వద్దు చేరింది. హైదరాబాద్,వరంగల్, (మిగతా 2లో)

## డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా

# పార్టీలకు ప్రచారం

**కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం..**

**దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియోలో ఉచిత ప్రసారం..**



**న్యూఢిల్లీ (తెలుగోడు), మార్చి 23 :**

నాలుగు అసెంబ్లీ ఎన్నికల వేళ భారత ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీలకు ఉచిత ప్రసార సమయం కోసం డిజిటల్ వోచర్లను కేటాయిస్తున్నట్టు ప్రకటించింది. దూరదర్శన్, (మిగతా 2లో)



## ఇల్లు ధ్వంసం, తనమీద దాడిపై

# అంబటి ఫిర్యాదు

**ఇంతవరకు కేసు నమోదు చేయకపోవడం దారుణం**

**న్యాయం చేయకపోతే సుప్రీం కోర్టు గడప తొక్కుతా**

**గుంటూరు (తెలుగోడు), మార్చి 23 :**

తన ఇల్లు, ఆఫీసుపై జరిగిన దాడిపై చర్యలు తీసుకోవాలంటూ మాజీ మంత్రి అంబటి రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడి కేసులో విచారణ అధికారిని మార్చాలని, నల్లపాడు పోలీస్ స్టేషన్ లో కస్టోడియల్ టార్చర్ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని రెండు ఫిర్యాదులు చేశారు. టీడీపీ నాయకుల దాడికి పోలీసులు పూర్తిగా సహకరించారని ఆరోపించారు. ఇలాంటి ఘటనలపై పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేయాలని తాను ఫిర్యాదు చేసే వరకూ కేసు నమోదు చెయ్యలేదన్నారు. ఏడేళ్ల లోపు శిక్షపడే సెక్షన్లతో కేసు నమోదు చేసినా జైలుకు పంపి తన ఇంటిపై దాడి చేసినవారికి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారన్నారు. పట్టాభిపురం (మిగతా 2లో)

## ఇహెచ్‌ఎస్ బిల్లులపై నేరుగా

# సమీక్ష

**ఎపి ప్రభుత్వం కీలక నిర్ణయం**



**అమరావతి (తెలుగోడు), మార్చి 23 :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రతకు సంబంధించి కూటమి ప్రభుత్వం ఒక కీలకమైన నిర్ణయం తీసుకుంది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ నిర్వహణలో సమూల మార్పులు శ్రీకారం చుట్టారు. గత కొంతకాలంగా ఈహెచ్‌ఎస్ బిల్లుల చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యాన్ని నివారించి, వ్యవస్థను మరింత పారదర్శకంగా మార్చేందుకు ప్రభుత్వం ఇకపై అన్ని రకాల లావాదేవీలను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ పద్ధతిలోనే నిర్వహించాలని నిర్ణయించింది. ఈ నూతన విధానం ద్వారా ఆసుపత్రులు అందించే చికిత్స బిల్లులు నేరుగా ఆన్‌లైన్ ద్వారానే ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ కార్యాలయానికి చేరుతాయి, తద్వారా (మిగతా 2లో)

# పారిశ్రామిక ప్రగతి దిశగా మరో అడుగు




(మొదటి పేజి (తరువాయి)

చోటుచేసుకుంటాయని తెలిపారు. భూములు ఇచ్చిన రైతుల త్యాగం వల్లే ఈ ప్రాజెక్ట్ సాధ్యమైందని, వారికి అన్ని విధాల సహకారం అందించాల్సిన అవసరం ఉందని సూచించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించడంతో పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని పేర్కొన్నారు. తక్కువ కాలంలోనే భారీ పెట్టుబడులు రాష్ట్రానికి ఆకర్షించగలిగామని వివరించారు. పోర్టులు, డేటా సెంటర్లు, ఐటీ రంగం, తయారీ పరిశ్రమలు కలిసి విశాఖ కేంద్రంగా ఆర్థిక శక్తిగా ఎదుగుతాయని తెలిపారు. ఉత్తరాంధ్రను రేర్ ఎర్త్ మినరల్ హబ్‌గా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, పరిశ్రమలకు అవసరమైన నీటిని పెద్ద ప్రాజెక్టుల ద్వారా అందించనున్నట్లు చెప్పారు. కొత్తగా పోర్టులు, అంతర్జాతీయ విమానాశ్రయం వంటి మౌలిక వసతులు కూడా అభివృద్ధి చెందనున్నాయని వెల్లడించారు. పారిశ్రామిక అభివృద్ధి ద్వారా ప్రతి కుటుంబానికి ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ద్వారా యువతను తయారు చేయనున్నట్లు తెలిపారు. స్థానిక యువతకు ప్రాధాన్యతతో ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఈ ఉక్కు పరిశ్రమ దేశీయ ఉత్పాదన పెంపుకు దోహదపడటమే కాకుండా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఊతమిచ్చే శక్తిగా మారుతుందని కేంద్రం అభిప్రాయపడింది. దేశ అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా ఉక్కు రంగం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. త్వరితగతిన ఈ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభించాలని ఆకాంక్ష వ్యక్తం చేస్తూ, రాష్ట్రం పారిశ్రామికంగా మరింత పురోగతి సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు

# డిజిటల్ ఫ్లాట్‌ఫాం ద్వారా పార్టీలకు ప్రచారం

(మొదటి పేజి (తరువాయి)

ఆల్ ఇండియా రేడియోలో మాత్రమే ఈ ఉచిత ప్రసార అవకాశం ఉంటుంది. త్వరలో అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ ఉచిత ప్రసార అవకాశం కల్పించింది.

ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని 39ఏ సెక్షన్ కింద రాజకీయ పార్టీలకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు ఈసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఎన్నికలు జరుగనున్న ఐదు రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలకు ఐటీ ఎ÷–లాట్‌ఫాం ద్వారా ఈ డిజిటల్ టైమ్ వోచర్లు జారీ చేస్తున్నట్లు పేర్కొంది. ఈ బ్రాడ్‌కాస్ట్ విండో అభ్యర్థుల జాబితా విడుదలైన తేదీ నుంచి ప్రారంభమై పోలింగ్‌కు రెండ్రోజుల ముందు వరకూ కొనసాగుతుందని తెలిపింది. రాష్ట్ర/యూటీ స్థాయిలో పారదర్శకంగా డ్రా నిర్వహించడం ద్వారా బ్రాడ్‌కాస్ట్ స్లాట్‌లు నిర్ధారిస్తారు. ప్రతి పార్టీకి దూరదర్శన్, అల్ ఇండియా రేడియాలో 45 నిమిషాల ఉచిత ప్రసార సమయం కేటాయిస్తారు. గత అసెంబ్లీ సమయంలో పార్టీల పనితీరు ఆధారంగా కూడా అదనపు ప్రసార సమయం కేటాయించే వీలుంటుంది. సాంకేతిక, రెగ్యులేటరీ ప్రమాణాలకు అనుగుణంగా రాజకీయ పార్టీలు ట్రాన్స్‌క్రిప్టులు, రికార్డింగ్‌లను ముందుగానే సమర్పించాల్సి ఉంటుంది. ఆయా రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను సమష్టిగా వ్యక్తం చేసేందుకు వీలుగా ప్రసార భారతి ప్యానల్ డిస్కషన్లు, డిబేట్లను కూడా నిర్వహిస్తుంది. చిత ప్రసార సమయం కేటాయింపు ద్వారా రాజకీయ పార్టీలు తమ విధానాలను, ప్రచారాన్ని ప్రజల్లోకి సులభంగా తీసుకువెళ్లవచ్చని ఈసీఐ భావిస్తోంది. ఇది

ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను పెంచి, సమాన అవకాశాలు కల్పించే డిజిటల్ చొరవగా పేర్కొంటోంది. ఇటీవల ఐదు రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీ ప్రకటించింది. కేరళ, అస్సాం, పుదుచ్చేరిలో ఒకే దశలో ఏప్రిల్ 9న పోలింగ్ జరుగనుండగా, తమిళనాడులో ఏప్రిల్ 23న పోలింగ్ జరుగుతుంది. పశ్చిమబెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో పోలింగ్ ఉంటుంది. నాలుగు రాష్ట్రాలు, పుదుచ్చేరిలో మే 4న ఫలితాలు వెలువడతాయి.

# నేడు ప్రపంచ టీబి దినోత్సవం

## నాపా ఆధ్వర్యంలో నేడు కెబిఆర్ పార్క్‌లో కార్యక్రమం

## వ్యాధిపట్ల ప్రజలు చైతన్యవంతం కావాలని పిలుపు




**హైదరాబాద్ (తెలుగోడు), మార్చి 23 :**

మాయమైందనుకున్న క్షయ వ్యాధి మళ్లీ విజృంభిస్తోంది. చాపకింద నీరులా వ్యాప్తి చెందుతోంది. కేంద్రప్రభుత్వం కట్టడి చర్యలు తీసుకుంటున్నా, ప్రజల నిర్లక్ష్యం కారణంగా మళ్లీ వ్యాప్తిం చెందుతోంది. వ్యాధి బారిన పడ్డవారు సరిగా గుర్తించకపోవడం, వైద్యుల సలహాలు పాటించక పోవడం, సరైన చికిత్స తీసుకోక పోవడం వంటి కారణాలతో మళ్లీ వ్యాప్తి చెందుతోంది. ఈ క్రమంలో సామాజిక బాధ్యతయగా గుర్తించిన యువ వైద్యులు ఓ బృందంగా ఏర్పడి ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు, చైతన్యం చేయడానికి పూనుకున్నారు. హైదరాబాద్ నగరంలో పెద్ద ఎత్తు ప్రచార కార్యక్రమాలకు దిగారు. 24న మంగళవారం ప్రపంచ టిబి దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో చైతన్యం కోసం వాకథాన్ నిర్వహించారు. ఆదివారం సంజీవయ్యపార్క్‌లో నిర్వహించిన వాకథాన్‌తో పాటు మంగళవారం కెబిఆర్ పార్క్‌లో కూడా దీనిని నిర్వహించబోతున్నారు. న్యూ ఏజ్ పల్మనాలజిస్ట్స్ అసోసియేషన్ కోర్ కమిటీ నాపా ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టింది. ఇందులో ప్రముఖ పల్మనాలజిస్టు డాక్టర్లు డా. వివేక్ వర్ధన్ వీరపనేని,డా. బి. అనిరుధ్,డా. రోహిత్ రెడ్డి,డా. గోవర్ధన్ రెడ్డి, డా. కె. ప్రశాంతి,డా. ఉపేంద్ర, డా. ఓబుల్ రెడ్డిలు ఉన్నారు. వీరంతా కలసి ఈకార్యక్రమం ద్వారా ప్రజాచైతన్యం

కోసం వాకథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సీనియర్ పల్మనాలజిస్టు డాక్టర్లు డా. విష్ణున్ రావు వీరపనేని,డా. సుధాకర్ కంది,డా. టిఎల్ఎన్ స్వామి,డా. దయానంద్ తదితరులు పాల్గొన్నారు. ప్రతి మూడు నిముషాలకు ఇద్దరు వ్యక్తులు టిబి కారణంగా చనిపోతున్నారని, ఇది అత్యంత బాధాకరమైన విషయమని, ప్రజలు చైతన్యం కావాలని నాపా ప్రతినిదులు సూచించారు. టిబికి ఆధునిక

వైద్య చికిత్స అందుబాటులో ఉందని, ఇది క్యూరబుల్ అని అన్నారు. ప్రపంచ జనాభాలో నాలుగింట ఒక వంతు మంది క్షయవ్యాధి బారినపడుతున్నారని అన్నారు. ఏళ్ళ తరబడి క్షయవ్యాధి అనేది వైద్యపరమైన చిక్కులు, సామాజిక, ఆర్థిక ఇబందులు చూపుతుందని అన్నారు. ఈ క్షయవ్యాధి ప్రపంచ మరణానికి ప్రధాన కారణం. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచవ్యాప్తంగా 18 లక్షల మరణాలతో 1.04 కోట్ల కొత్త కేసులు నమోదైనవి అని నివేదించిందని అన్నారు. అవగాహనను పెంచడానికి, ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని 1982 నుండి ప్రతి సంవత్సరం మార్చి 24న జరుపుకుంటున్నామని అన్నారు. తమ బాధ్యతగా నాపా ప్రతినిధులంతా కలసి ప్రజలను చైతన్యం చేఏందుకు ముందుకు వచ్చామని నాపా ప్రతినిధి డాక్టర్ వివేక వర్ధన్ వీరపనేని అన్నారు. వాడుక భాషలో టిబిగా పిలిచే క్షయ వ్యాధి వల్ల ప్రతి సంవత్సరం అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ వ్యాధి మైకోబ్యాక్టీరియం ట్యుబర్‌కులోసిస్ అనే బ్యాక్టీరియా వల్ల వస్తుంది. ఈ వ్యాధి ప్రధానంగా ఊపిరితిత్తులపై ప్రభావం చూపిస్తుంది. కానీ మెదడు, మూత్రపిండాలు మరియు వెన్నెముక వంటి శరీరంలోని ఇతర భాగాలపై కూడా ఇది ప్రభావం చూపిస్తుందని అన్నారు. అందువల్ల ప్రజలు అప్రమత్తం కావలని, సకాలంలో వైద్యుల సలహాలు తీసుకుని, చికిత్సకు సిద్దం కావాలన్నారు. తాము నిర్వహించే వాకథాన్ ప్రజల్లో చైతన్యం కలిగిస్తే అంతకు మించిన లక్ష్యం మరోటి లేదన్నారు.

# యుద్ధం ఆగింది

(మొదటి పేజి (తరువాయి)

కాల్పుల విరమణను చర్చల పురోగతికి ఉపయోగించుకోవాలని భావిస్తున్నారు. అయితే ఇది శాశ్వత శాంతి కాదని స్పష్టం చేశారు. చర్చలు ఫలించకపోతే మళ్లీ సైనిక చర్యలు తప్పవని హెచ్చరిక జారీ చేశారు. అంటే ఒకవైపు చర్చలు కొనసాగుతుండగా మరోవైపు ఒత్తిడి కొనసాగించే విధానాన్ని అనుసరిస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ ప్రకటన వెలువడినప్పటికీ ఇరాన్ నుంచి అధికారిక ధృవీకరణ రాకపోవడం గమనార్హం. దీంతో ఈ తాత్కాలిక విరమణ వెనుక అసలు వ్యూహం ఏమిటన్నది అంతర్జాతీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మిత్రదేశాలు కూడా ఈ పరిణామాలపై అప్రమత్తంగా ఉన్నాయి. అంతర్జాతీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం ముడి చమురు ధరలు భారీగా పెరిగే ప్రమాదం కూడా ఈ నిర్ణయానికి ఒక కారణంగా భావిస్తున్నారు. ధరలు అదుపు తప్పితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉండటంతో ఇరు దేశాలు తాత్కాలికంగా వెనక్కి తగ్గినట్లు అంచనా వేస్తున్నారు. ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హోర్ముజ్ జలసంధి అంశంపైనే ప్రధానంగా చర్చలు సాగినట్లు సమాచారం. అంతర్జాతీయ నౌకల రాకపోకలకు అడ్డంకులు తొలగించే దిశగా ముందడుగు పడే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో రాబోయే ఐదు రోజులు ప్రపంచ రాజకీయాల్లో కీలకంగా మారనున్నాయి.....

# యుద్ధంతో భారత్‌కు ఎన్నో సవాళ్లు

(మొదటి పేజి (తరువాయి)

మోదీ చెప్పారు. ఇంధన భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, దేశంలో 60 శాతం ఒఖఉ ఉత్పత్తి చేస్తున్నామని, 41 దేశాల నుంచి ఇంధనం కొనుగోలు చేస్తున్నామని మోదీ స్పష్టం చేశారు. దేశంలో 53 లక్షల మెట్రిక్ టన్నుల పెట్రోల్ రిజర్వ్ ఉన్నాయని, హోర్ముజ్ నుంచి మరిన్ని నౌకలు భారత్‌కు వస్తున్నాయని మోదీ వెల్లడించారు. రైల్వేల విద్యుదీకరణతో 180 కోట్ల లీటర్ల డీజిల్ ఆదా అయిందని కూడా మోదీ లోక్ సభలో చెప్పారు. ప్రపంచానికి ఆర్థికమాంద్యం ముప్పు పొంచి ఉందన్న ప్రధాని, భారత్‌పై మాంద్యం ప్రభావం పడకుండా చూస్తున్నామని, ఎలాంటి సంక్షోభాన్నైనా ఎదుర్కొనేందుకు సిద్ధమని మోదీ అన్నారు. ఖరీఫ్‌లో రైతులకు డీజిల్ కొరత లేకుండా చూస్తున్నామని, పవర్ ఎ÷–లాంట్స్‌కు కావాల్సినంత బొగ్గు నిల్వలు ఉన్నాయని మోదీ పేర్కొన్నారు. గల్ఫ్ సంక్షోభంపై పార్లమెంట్ మొత్తం ఒకే గళం వినిపించాలని మోదీ ఈ సందర్భంగా కోరారు. పశ్చిమాసియా సంక్షోభం.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై, ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. భారత్‌కు కూడా సవాళ్లు ఎదురవుతున్నాయి. మనకు ఎక్కువగా గల్ఫ్ నుంచే ముడిచమురు, గ్యాస్ వస్తోంది. యుద్ధం వల్ల ఇతర దేశాలతో జరిగే వాణిజ్యం దెబ్బతింటోంది. పశ్చిమాసియా ప్రాంతంలో దాదాపు కోటి మంది భారతీయులు నివసిస్తున్నారు. వాణిజ్య నౌకల్లోనూ అనేకమంది భారతీయ సిబ్బంది పనిచేస్తున్నారు. వారికి అవసరమైన సాయం అందిస్తున్నాం. భారత దౌత్య కార్యాలయాలు సాధ్యమైనంత తోడ్పాటు అందిస్తున్నాయి. ఈ ప్రాంతంలోని దేశాధినేతలతో ఇప్పటికే రెండుసార్లు మాట్లాడాను అని అన్నారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో భారతీయుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాం. యుద్ధం మొదలైనప్పటి నుంచి 3.75 లక్షల మంది భారతీయులు అక్కడి నుంచి

స్వదేశానికి చేరుకున్నారు. అదేవిధంగా దాదాపు వెయ్యిమంది విద్యార్థులు తిరిగి వచ్చారు. యుద్ధ ప్రభావిత దేశాల్లో సీబీఎస్ఈ ఇప్పటికే 10, 12వ తరగతి బోర్డు పరీక్షలను రద్దు చేసింది. పశ్చిమాసియా పరిణామాల విషయంలో కేంద్రం ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది. అన్ని విధాలా సహాయం అందించడానికి సిద్ధంగా ఉందని అన్నారు. అలాగే దేశీయంగా ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచుతున్నాం. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ సరఫరా సజావుగా జరిగేలా నిరంతర ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాదారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. గతంలో 27 దేశాల నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకునేవాళ్లం. ఇప్పుడు ఆ సంఖ్య 41కి పెరిగింది. మనవద్ద ప్రస్తుతం 53 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు ఉన్నాయి. వీటిని 65 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా పెంచే దిశగా కృషి చేస్తున్నాం అని వివరించారు. ఇంధనంలో ఇథనాల్ కలపడాన్ని పెంచడం ద్వారా ఏటా ముడి చమురు దిగుమతులను 4.5 కోట్ల బ్యారెళ్ల మేర తగ్గించగలిగాం. ప్రభుత్వ, పారిశ్రామిక రంగాల సంయుక్త కృషితో.. ఈ సంక్షోభం వల్ల తలెత్తే సవాళ్లను దీటుగా ఎదుర్కోగలమనే నమ్మకం ఉంది. యూరియా, ఇతర ఎరువుల విషయంలో రైతులకు సాధ్యమైనంతమేర సాయం అందిస్తూనే ఉంటాం. చర్చలు, దౌత్యం ద్వారా పశ్చిమాసియా సంక్షోభానికి శాంతియుత పరిష్కారం సాధించేలా అన్ని పక్షాలను ప్రోత్సహిస్తున్నాం అని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు.

# పారిశ్రామిక హబ్‌గా విశాఖ

## రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్




**అమరావతి (తెలుగోడు), మార్చి 23 :**

ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ రాకతో విశాఖ ప్రాంతం పరిశ్రమల హబ్‌గా మారుతోందని రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్, యువ నేత, మంత్రి నారా లోకేశ్ కష్టానికి ప్రతిఫలం ఈ ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు అని ఆయన పేర్కొన్నారు. సోమవారం రాజధాని అమరావతిలో మంత్రి అనగాని సత్య ప్రసాద్ విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి చరిత్రలో నేడు ఓ గొప్ప మైలురాయి అని ఆయన అభివర్ణించారు. ఉక్కు రంగంలో రాష్ట్రానికి రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడితో ఈ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు శంకుస్థాపన జరిగిందని మంత్రి అనగాని వివరించారు. అనకాపల్లి జిల్లా రాజయ్యపేటలో సోమవారం మధ్యాహ్నం కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమార స్వామితో కలిసి సీఎం చంద్రబాబు ఈ స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో పలువురు కేంద్ర మంత్రులతోపాటు రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొనున్నారు. ఈ స్టీల్ ప్లాంట్ ద్వారా లక్ష మందికిపైగా ఉపాధి కలగనుంది. ఈ స్టీల్ ఎ÷–లాంట్‌కు అనుబంధంగా రూ.11,198 కోట్లతో క్యాప్టివ్ పోర్ట్ ఏర్పాటు చేయనున్నారు. దీంతో మరో 6 వేల ఉద్యోగాలు క్యాప్టివ్ పోర్ట్ ద్వారా రానున్నాయి. ఇక ఈ స్టీల్ ప్లాంట్ ద్వారా లక్ష మందికిపైగా ఉపాధి కలగనుంది.

# నా కుమారుడు నిరపరాధి

## మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

**కడప (తెలుగోడు), మార్చి 23 :**

డ్రగ్స్ కేసులో 'నా కుమారుడు నిరపరాధి' అని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. తెలంగాణ రంగారెడ్డి జిల్లాలోని మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసు వివాదంపై కడప జిల్లా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం కడప జిల్లాలో మీడియాతో ఆయన మాట్లాడారు. తన కుమారుడు, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ డ్రగ్స్ కేసులో చిక్కుకోవడంపై క్లారిటఇచ్చారు. మొయినాబాద్ ఫాంహౌస్ ఘటనపై సుధాకర్ యాదవ్ స్పందించారు. తన కుమారుడిపై వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నానని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. మొయినాబాద్ ఫాంహౌస్‌లో జరిగిన పార్టీకి ఎంపీ మహేశ్‌కుమార్ యాదవ్ వెళ్లిన మాట నిజమేనని పుట్టా సుధాకర్ యాదవ్ అంగీకరించారు. అయితే, తన కుమారుడికి ఎలాంటి చెడు అలవాట్లు లేవని, ముఖ్యంగా డ్రగ్స్ తీసుకునే అలవాటు అస్సలు లేదని స్పష్టం చేశారు. మహేశ్ వద్ద నుంచి కనీసం బ్లడ్ శాంపిల్స్ తీసుకోకుండానే రిపోర్టులో పాజిటివ్ అని ఎలా



నిర్ధారిస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ నిర్ధారణ పక్రియపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలతో కూడిన నివేదికను తెలుగుదేశం పార్టీ అధిష్ఠానానికి సమర్పించినట్లు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ వెల్లడించారు. పోలీసుల విచారణ ఇంకా కొనసాగుతోందని, ఇన్వెస్టిగేషన్ ముగిశాక అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. పోలీసుల విచారణ పూర్తయిన తర్వాత, మహేశ్ నిరపరాధి అని నిరూపించే అన్ని ఆధారాలతో మీడియా ముందుకు వస్తామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు.

# లోకేష్ ప్రజాదర్బార్‌లో వినతుల వెల్లువ

(మొదటి పేజి (తరువాయి)

కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు కీలక వినతులు ఆయనకు అందాయి. ఆంధ్రా యూనివర్సిటీలో కనిష్ఠ కాల పరిమితిపై పనిచేస్తున్న ఉద్యోగులు మంత్రి లోకేశ్‌ను కలిసి తమ పదవీ విరమణ వయోపరిమితిని 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. ఇతర ప్రభుత్వ విభాగాల్లో ఉన్న విధంగానే తమకూ అదే సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల విడుదలైన ఉద్యోగాల క్యాలెండర్‌పై పలువురు అభ్యర్థులు స్పందిస్తూ విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న సహాయ కార్యనిర్వాహక ఇంజనీరు, జూనియర్ లైన్‌మెన్ పోస్టులను కూడా చేర్చి వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. విశాఖపట్నం విమానాశ్రయంలో పనిచేస్తున్న పోర్టర్లు తమ భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేశారు. త్వరలో ప్రారంభం కానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో తమకు ఉపాధి కల్పించాలని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అందిన ప్రతి వినతిని సంబంధిత అధికారులతో సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. యువతకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తామని మంత్రి లోకేశ్ భరోసా కల్పించారు..

# పీజీ సీట్ల కౌన్సిలింగ్‌పై స్పష్టత కోరిన సుప్రీం ధర్మాసనం

(మొదటి పేజి (తరువాయి)

మంగళవారానికి వాయిదా వేసింది. ఫిబ్రవరి 28తో కౌన్సెలింగ్ ముగిసినప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో 246, తెలంగాణలో 377 పీజీ సీట్లు భర్తీ కాలేదని వైద్య కళాశాల యాజమాన్యాలు కోర్టు దృష్టికి తీసుకువచ్చాయి. వీటిలో ఏపీలో సుమారు 45 కన్వీనర్ కోటా సీట్లు కూడా ఉన్నట్లు న్యాయస్థానానికి వివరించారు. కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉన్నప్పటికీ గడువు ముగియడంతో కౌన్సెలింగ్ నిలిచిపోయిందని యాజమాన్యాలు వాదించాయి. సీట్లు ఖాళీగా ఉండటం వల్ల విద్యార్థులకు నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. కౌన్సెలింగ్ గడువు ముగియకముందే సంబంధిత విశ్వవిద్యాలయాలు, కాలేజీలు జాతీయ వైద్య కమిషన్‌ను సంప్రదించి గడువు పొడిగించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. అయితే ఆ విజ్ఞప్తులకు ఎలాంటి స్పందన రాలేదని న్యాయవాదులు కోర్టుకు తెలియజేశారు. జాతీయ వైద్య కమిషన్ స్పందించకపోవడంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశిస్తూ తదుపరి విచారణలో స్పష్టత ఇవ్వాలని సూచించింది. ఈ అంశంపై మరింత పరిశీలన అవసరమని భావించిన ధర్మాసనం విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. తదుపరి విచారణలో కీలక నిర్ణయం వెలువడే అవకాశముందని భావిస్తున్నారు.

# యుద్ధం ఆగలేదు

(మొదటి పేజి (తరువాయి)

దాడులను ఆపే సూచనలు చూపడం లేదు. ట్రంప్ ప్రకటనలను పట్టించుకోకుండా ఇరాన్‌లోని మౌలిక సదుపాయాలపై దాడులు కొనసాగించినట్లు ప్రకటించింది. రాత్రికి దాడులు మరింత పెంచే అవకాశం ఉన్నట్లు సంకేతాలు ఇచ్చింది. ఈ నేపథ్యంలో రాబోయే రోజులు పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చే అవకాశం ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

# అమరావతి నిర్మాణం

(మొదటి పేజి (తరువాయి)

ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రపంచంలోని ఉత్తమ అసెంబ్లీ భవనాల్లో ఒకటిగా ఇది నిలుస్తుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీ, హైకోర్టుతో పాటు మరో ఐదు ఐకానిక్ టవర్లను అత్యద్భుతంగా నిర్మిస్తున్నామని మంత్రి నారాయణ వెల్లడించారు. ఐకానిక్ భవనాలు కాబట్టి సాధారణ భవనాల కంటే వీటికి ఖర్చు కొంత ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లోని ఐకానిక్ భవనాల రేట్లతో పోల్చి వీటిని చూస్తున్నామని, ఎస్ఆర్ (÷ూఖీ) రేట్ల ప్రకారం నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ పారదర్శకంగా పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రాజధాని పనుల కోసం భారీ ఎత్తున నిధులను ప్రభుత్వం సమకూర్చుకుంటోందని మంత్రి నారాయణ అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 15 వేల కోట్లు, హడ్కో ద్వారా మరో రూ. 11 వేల కోట్లు సమకూర్చుకుంటున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు.

# అంబటి ఫిర్యాదు

(మొదటి పేజి (తరువాయి)

సీఐ వెంకటేశ్వర్లు నా కేసు వ్యవహారంలో దారుణంగా వ్యవహరించారని మండిపడ్డారు. ఇక్కడ న్యాయం జరగకపోతే హైకోర్టు, అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్తామని తేల్చిచెప్పారు. జనవరి 31న తన ఇల్లు, కార్యాలయంపై సుమారు 7 గంటల పాటు దాడి జరిగిందని ఆరోపణ చేశారు. దాడి తర్వాత తనను అరెస్ట్ చేసి 18 రోజుల తర్వాత బెయిల్‌పై విడుదల చేసినట్లు వెల్లడించారు. పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేయలేదని విమర్శలు చేశారు. పిర్యాదు చేసిన తర్వాతే కేసు నమోదు చేశారని ఆరోపణలు చేశారు. తన ఇంటిపై దాడి, హత్యాయత్నం, ఆస్తి నష్టం కేసులు నమోదు చేయాలన్నారు. సిట్ ఏర్పాటు చేసి దర్యాప్తు జరపాలని, నల్లపాడు పోలీస్ స్టేషన్ సీసీటీవీ ఫుటేజ్ స్వాధీనం చేసుకోవాలన్నారు. ఈ ఘటన వెనుక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఉన్నారని ఆయన ఆరోపించిన అంబటి రాంబాబు.. అలాగే టీడీపీ నేతలతో పోలీసులు కుమ్మక్కయ్యారని కూడా విమర్శించారు. తనపై నమోదైన కేసులు, అరెస్ట్ విధానంపై ఇప్పటికే హైకోర్టులో రిట్ పిటిషన్ వేసినట్లు తెలిపారు. అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు.

# నేరుగా సమీక్ష

(మొదటి పేజి (తరువాయి)

మధ్యవర్తుల ప్రమేయం లేకుండా చెల్లింపుల పక్రియ వేగవంతం అవుతుంది. ప్రస్తుతం అమలులో ఉన్న ఈహెచ్ఎస్ విధానాన్ని ప్రభుత్వం సమగ్రంగా పునఃసమీక్షించి, ఉద్యోగులు , పెన్షనర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మరింత సరళీకృతమైన సాఫ్ట్‌వేర్‌ను రూపొందించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పాత పద్ధతిలో ఉన్న సాంకేతిక లోపాలను సరిదిద్ది, ఆధునిక సాంకేతికతను జోడించడం ద్వారా ఆసుపత్రులకు సకాలంలో నిధులు విడుదలయ్యేలా చూడాలని, తద్వారా ఉద్యోగులకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత చికిత్స (అజీబర్గ÷బబ ÷ుస।జీబిప।నిబి) నిరంతరాయంగా అందాలని ఆయన స్పష్టం చేశారు.

# తగ్గిన బంగారం ధరలు

(మొదటి పేజి (తరువాయి)

నిజామాబాద్, ఖమ్మంలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.14,002, 22 క్యారెట్ల బంగారం ధర రూ.12,835, 18 క్యారెట్ల బంగారం ధర రూ.10,502కు చేరింది. విజయవాడ, విశాఖపట్నం, అమరావతి, గుంటూరు, నెల్లూరు, కాకినాడ, తిరుపతి, కడప, అనంతపురంలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.14,002, 22 క్యారెట్ల బంగారం ధర రూ.రూ.12,835, 18 క్యారెట్ల బంగారం ధర రూ.10,502గా ఉంది. తెలుగు రాష్ట్రాల్లో కేజీ వెండి ధర రూ.15 తగ్గి రూ.230, కేజీకి రూ.2,30,000 వద్ద రూ.15,000 తగ్గింది.



యాడికి ప్రభుత్వ వైద్యశాలలో ఈఎన్ఆర్ అమలుపై డాక్టర్‌తో చర్చిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహేర్

# ఈహెచ్ఆర్ అమలు పరిశీలన

## అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహేర్..

**యాడికి (తెలుగోడు), మార్చి 23:**
యాడికి మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ (ఈహెచ్ఆర్) అమలు సాధ్యాసాధ్యాలపై ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహేర్ ఆరా తీశారు. ఈహెచ్ఆర్ అమలుకు యాడికి ప్రభుత్వ వైద్యశాలను పైలట్ ప్రాజెక్ట్ ఎంపికచే శారు. ఈహెచ్ఆర్ ఎంతవరకు అమలుచేయవచ్చు, దీనిపై అవగా హణ చర్యలు అమలులో అవరోధాలు ఆరోగ్య సేవ యాప్ పై వంటి విషయాలు చర్చించారు. చేసిన వాటిని పరిశీలించారు ఈహెచ్ఆర్ అమలైతే ప్రతి రోగికి ఒక ఐడీనెంబర్ కేటాయింపు, కేస్ స్టడీ లాంటి అన్ని వివరాలు అందులో నమోదుచేస్తారు. చికిత్స కోసం రాష్ట్రంలోని ఏ వైద్యశాలకు వెళ్లినా పేషంట్ వివరాలు, రోగాలు గతంలో తీసుకున్న వైద్య చికిత్స లాంటి వివరాలన్ని ఇందులో నమోదై ఉంటాయి. పైలెట్ ప్రాజెక్ట్ ఎంపికైన యాడికి ప్రభుత్వ వైద్యశాలలో ఈహెచ్ఆర్ అమలు అయితే రోగులకు మరింత మెరుగైన సేవలు అందనున్నాయి. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహేర్. వైద్యాధికారి పరమేష్. డాక్టర్ సాయి సుమంత్ రెడ్డి. మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సూపర్వైజర్ రాంప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.

# వడదెబ్బ గురించి అవగాహన కలిగించండి

## మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు..

**యాడికి (తెలుగోడు), మార్చి 23:**
వడదెబ్బ గురించి ప్రజలకు అవగాహన కలిగించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు అన్నారు. జిల్లా మలేరియా అధికారి డి ఓబుల్ ఆదేశాల మేరకు సోమవారం చుక్కలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లావణ్య. డాక్టర్ కేశవానంద ఆధ్వర్యంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు



చుకులూరు ఆరోగ్య కేంద్రంలోని రక్తపరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు



చుక్కలూరు ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు

చుక్కలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ల్యాబ్‌ను పరిశీలించారు. ల్యాబ్ లోని రికార్డులన్నీ వెరిఫై చేసి ల్యాబ్ టెక్నీషియన్ నాగజ్యోతికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రమునకు జ్వరము అని వచ్చిన ప్రతి ఒక్కరికి డెంగు మలేరియా టైఫాయిడ్ చికెన్ గునియా మొదలగు రక్తపరీక్ష నిర్వహించాలని సూచనలు ఇచ్చారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, ఫ్రైడే డ్రైడే గురించి ప్రజలకు వివరించాలని తెలిపారు. ఎం పి హెచ్ ఎం డైరీ ఎంఎఫ్‌టు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చుక్కలూరు ఎంపీహెచ్‌ఈఓ లక్ష్మన్న, తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, మేల్ సూపర్వైజర్ ఎంపీ నారాయణ, ల్యాబ్ టెక్నీషియన్ నాగజ్యోతి, ఎం పి హెచ్ ఎ నారాయణస్వామి, పాల్గొన్నారు.



కోసిగిలో భగత్ సింగ్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

# భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌కు నివాళి

**కోసిగి (తెలుగోడు), మార్చి 23 :**
ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ 95వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కోసిగి సీపీఐ కార్యాలయంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించడం జరిగింది.. అనంతరం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుదర్శన్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం. రాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్, సీపీఐ మండల కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ భగత్ సింగ్ పంజాబ్ ప్రాంతంలోని ఖత్కర్ కలాన్ అనే గ్రామంలో 1907 సెప్టెంబర్ 28న జన్మించాడని. 20 సంవత్సరాల వయస్సు లోనే బ్రిటిష్ వారిని గడ గడ లాడించి, 23 సంవత్సరాల వయసులోనే భారత మాత దాస్య శృంఖలాల నుండి విడిపించడం కోసం ప్రాణ త్యాగం చేసి, ప్రతి భారతీయుడిలో విప్లవాగ్నిని రగిలించిన యోధుడు. భగత్ సింగ్ అంటేనే ఒక మండే అగ్నిగోళం, జ్వలించే నిప్పుకణిక దేశ స్వాతంత్ర్యం కోసం తన స్నేహితులు రాజ్ గురు, సుఖ్ దేవ్ లతో కలిసి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమాలు కొనసాగించి, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి ఉరికొయ్యను ముద్దాడన్నారు. మార్చి 23, 1931న అసువులు బాశారని నిరంకుశ బ్రిటిష్ ప్రభుత్వం వారి ముగ్గురిని నిల్చోబెట్టి ఉరి తీసిందన్నారు. ఉరికొయ్య ముందు ఆ ముగ్గురు నిల్చుని ఏ మాత్రం భయపడలేదని. ఆ ధైర్యమే ప్రవాహంలా మారి నేటి తరాలకు చేరిందని వారు అన్నారు. వారి స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై విద్యార్థి, యువత పోరాటాలు కొనసాగించాలని వారు పిలుపునివ్వడం జరిగిందని. ఈ యొక్క కార్యక్రమంలో సీపీఐ నాయకులు తాయన్న, ఈరన్న, మూకయ్య ఏఐవైఎఫ్ నాయకులు జీవన్, కోసిగయ్య ఏఐఎస్ఎఫ్ నాయకులు మల్లికార్జున, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.



సీతారాముల కళ్యాణోత్సవం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

# శ్రీ సీతారాముల కల్యాణోత్సవం ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

**అనంతపురం కల్చరల్ (తెలుగోడు), మార్చి 23:**
స్థానిక శ్రీనివాస్‌నగర్‌లో ఉన్న శ్రీ సీతారామాంజనేయ దేవస్థానంలో ఈనెల 27వ తేదీ శ్రీరామనవమి పునస్కరించుకుని శ్రీ సీతారాముల కళ్యాణం ఆహ్వాన పత్రికలు కమిటీ సభ్యులు శ్రీవారి సేవకులు, ఆలయ ధర్మకర్త ఆళ్లగడ్డ రాము ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త ఆళ్లగడ్డ రాము మాట్లాడుతూ గత 45 సంవత్సరాలుగా కీర్తిశేషులు ఆళ్లగడ్డ సుబ్బయ్య సుబ్బయ్య వంశపారంపర్యంగా శ్రీ సీతారాముల కళ్యాణం ఉత్సవం వైభవంగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉదయం నుండి సుప్రభాత సేవ మొదలుకొని గణపతి పూజ నవగ్రహ పూజ 10-00 గంటల నుండి శ్రీ సీతారామ కళ్యాణోత్సవం కార్యక్రమం ప్రారంభమై అభిజిత్ లగ్నంలో శ్రీరాముడికి పట్టాభిషేకం అనంతరం అన్నదాన ఉంటుందన్నారు.. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాంప్రసాద్ రామ్మూర్తి రామచంద్ర మురళి మహేంద్ర అలాగే శ్రీవారి సేవకులు అనిల్ ప్రసాద్ ముఖేష్ శ్రీనివాస్ ప్రకాష్ సుంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల దాహార్తి తీర్చటం మహాపుణ్యకార్యం

## చలివేంద్రం పారంభం.. సిఐ శివశంకర్ నాయక్

**పామిడి (తెలుగోడు), మార్చి 23:**
ప్రజల దాహార్తిని తీర్చటం మహాపుణ్యకార్యం అని సిఐ శివశంకర్ నాయక్పే ర్కొన్నారు. పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సిఐ శివశంకర్ నాయక్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన




చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సిఐ శివశంకర్ నాయక్




చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సిఐ శివశంకర్ నాయక్

మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చటానికి లయన్స్ క్లబ్ వారు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయం అన్నారు. ప్రభుత్వ ఆయూష్ సీనియర్ వైద్యాధికారి లయన్స్ క్లబ్ వ్యవస్థపాక అధ్యక్షులు డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాజకీయాలకు అతీతంగా సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివకార్తీకరెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు రఘువీర్ రావు, పట్రా శ్రీనివాసులు, జిల్లా ఛైర్ పర్సన్ డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ శాంతిప్రియ తదితరులు పాల్గొన్నారు.



దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

# ఘనంగా 'శెట్టి బలిజ జాతిపిత' దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలు

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 23 :**
శెట్టిబలిజ జాతిపిత, ప్రముఖ సంఘ సంస్కర్త దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలను సోమవారం బత్తలపల్లిలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నరసింహానాయుడు మాట్లాడుతూ, శెట్టిబలిజ సమాజంలో విద్య, ఐక్యత, సామాజిక గౌరవం పెంపొందించడంలో వెంకటరెడ్డి గారి సేవలు విశేషమని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ప్రభుత్వం ఆయన జయంతిని రాష్ట్ర స్థాయి వేడుకగా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో క్రిష్టప్ప, సచివాలయాల అధికారి రామ్మోహన్ నాయుడు, కార్యాలయ ఏవో మల్లికార్జున, సర్పంచ్ చల్లా కరుణాకర్ నాయుడు, నాయకులు చల్లా బొజ్జి, చల్లా శ్రీనివాసులు, సంఘాల సూరి, మాదిరెడ్డి చెన్నారెడ్డి మరియు మండల పరిషత్, సచివాలయ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

**యాడికి (తెలుగోడు), మార్చి 23:**
యాడికి మండల కేంద్రంలోని అమీనా కంటి వైద్య ఆసుపత్రిలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అమీనా కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నంద్యాల శాంతి రామ్ కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి వివిధ గ్రామాల నుండి కంటి జబ్బులతో వచ్చిన 90 మందికి కంటి వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించారు. ఇందులో 40 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఆపరేషన్ల కోసం వెళ్లే వారికి ఉచిత బస్సు, భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అమీనా కంటి ఆసుపత్రి యజమాని సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.



కంటి వైద్య పరీక్షకు వచ్చిన ప్రజలు



అమీనా ఉచిత కంటి వైద్య శిబిరంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం



వాల్ పోస్టర్లు విడుదల చేస్తున్న ఎంఆర్పిఎస్ నాయకులు

# మాదిగల చైతన్య సదస్సు వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**గుత్తి (తెలుగోడు), మార్చి 23:**
అనంతపురం నగరంలోని గిరిజన భవన్‌లో ఈనెల 30న నిర్వహించ తలపెట్టిన మాదిగల చైతన్య సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్లను సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులు విడుదల చేశారు. పట్టణంలోని ఆర్ అండ్‌బి బంగ్లా ఆవరణంలో ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమంలో భాగంగా వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ఎస్సీ అండ్ ఎస్టి అట్రాసిటీ కేసుల న్యాయ విచారణ ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా ఏర్పాటు చేయాలి ఎస్సీ ఎస్టీల పైన దాడులు అధికమయ్యాయని వీటి పైన ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని దాడులు చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి స్టేషన్ బెయిల్ ఇవ్వకుండా రిమాండ్ కు పంపే విధంగా ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నిర్వహించనున్నఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం లో ఏపీ ఎంఆర్పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ ప్రసాద్ సిపిఐ మండల కార్యదర్శి రాందాసు ఏపీ ఎంఆర్పిఎస్ నాయకులు రజాపురం రామాంజి శివరామ్ అంజి లాలు కరిడికొండ శివ ఓబులేసు రమణ బండల రామాంజి సలీం సిపిఐ నాయకులు వెంకటరాముడు రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ 95వ వర్ధంతి

**అనంతపురం రూరల్ (తెలుగోడు), మార్చి 23:**
స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ భగత్ సింగ్ 95వ వర్ధంతిని అనంతపురం నగరంలో సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జి, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సంతోష్ కుమార్ ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు మల్లికార్జున చాxూఖీ అనంతపురం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు హనుమంతు రాయుడు కుళ్లాయిస్వామి ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కోట్రేస్ చాxూఖీ-చాxొఖీ నాయకులు పాల్గొన్నారు.

## నగరాభివృద్ధిపై ఎమ్మెల్యే దగ్గుపాటి దృష్టి

**అనంతపురం రూరల్ (తెలుగోడు), మార్చి 23:**
అనంతపురం నగరపాలక సంస్థలో ప్రత్యేక అధికారుల పాలన రావడంతో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నగరాభివృద్ధిపై దృష్టి పెట్టారు. ప్రస్తుతం నగరపాలక సంస్థకు ప్రత్యేక అధికారిగా ఉన్న జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తో కలెక్టరేట్లో కీలక సమావేశం జరిగింది. కమిషనర్ జశ్వంత్ రావు, ఇతర అధికారులతో పాటు ఆయన జిల్లా కలెక్టర్ ని కలిశారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ఇంకా చేపట్టాల్సిన పనులు, ప్రజా సమస్యలు, ఇతర వాటిపై ప్రధానంగా చర్చించారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు వేగవంతమయ్యేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చేలా చూడాలని ఎమ్మెల్యే దగ్గుపాటి కోరారు. అలాగే నగరంలో అక్రమ కట్టడాలు గురించి ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.

# రైతన్నా మీకోసం కార్యక్రమం

**రోళ్ల,(తెలుగోడు)మార్చి 23:**
రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 'రైతన్నా మీ కోసం' కార్యక్రమాన్ని మండలంలోని దొడ్డేరి రైతు సేవా కేంద్రంలో సోమవారం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రారంభించారు. రైతు శ్రేయస్సు కోసం ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఇందులో భాగంగానే ప్రతి ఏటా ప్రతి రైతుకు 20 వేలు చొప్పున అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ అందిస్తున్నరని తెలిపారు. అన్నదాతా సుఖీభవ - పీఎం కిసాన్ పథకం కింద మూడు విడతల్లో ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున అర్హత ఉన్న ప్రతి రైతు కుటుంబాలకు అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ కలిపి మూడవ విడతలుగా ఇప్పటికే రైతుల ఖాతాలోకి జమచేసారన్నారు. ఈసందర్భంగా ప్రకృతి వ్యవసాయాన్ని ఎలా సాగు చేయాలి వాటి వల్ల ఉపయోగాలను జడ్ పి ఎన్ ఎఫ్ సిబ్బంది రైతులకు వివరించారు. జీవామృతం, ఎలా తయారు చేసుకోవాలి చక్కగా వివరించారు. ఈ కార్యక్రమంలో మడకశిర మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి,రాష్ట్ర వక్కలిగా సాధికార కన్వీనర్ విఎం పాండురంగప్ప, మండల కన్వీనర్ జి కె ఈరన్న,సింగల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి,సింగల్ విండో అధ్యక్షులు భరత్,టి ఎన్ టి యూ సి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఉమేష్ పంచాయతీ అధ్యక్షులు శనివారప్ప, నాయకులు హనుమంతరాయప్ప,జడ్ పి ఎన్ ఎఫ్ సిబ్బంది రైతులు, అధికారులు పాల్గొన్నారు.



రైతన్న మీకోసం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న టీడీపి నాయకులు



జీవామృతం తయారీ విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న జడ్‌పిఎన్‌ఎఫ్ అధికారులు

# భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌కు ఘన నివాళులు

**గుత్తి (తెలుగోడు), మార్చి 23:**
భగత్ సింగ్ రాజ్ గురు సుఖదేవ్ వర్ధంతి సందర్భంగా జన విజ్ఞాన వేదిక, భగత్ సింగ్ బోస్ కమిటీ ఆధ్వర్యంలో గుత్తి పట్టణంలోని సత్రం మిట్ట వద్ద ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. పట్టణంలోని పెన్షనర్ అసోసియేషన్ కార్యాలయం రాజ్ గురు సుఖదేవ్ కు ఘనంగా నివాళులర్పించారు. అసోసియేషన్ కార్యదర్శి రామ్మోహన్ కోశాధికారి కుల్లాయి బాబుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రంగన్న మాట్లాడుతూ భగత్ సింగ్ అతి చిన్న వయసులోనే దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన మహా వ్యక్తి అని స్వాతంత్రం రావడానికి



భగత్ సింగ్ , రాజ్‌గురు, సుక్ దేవ్‌కు నివాళులర్పిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు



భగత్ సింగ్ , రాజ్‌గురు, సుక్ దేవ్‌కు నివాళులర్పిస్తున్న జనవిజ్ఞాన వేదిక నాయకులు

ముఖ్య వ్యక్తి అని అన్నారు. భగత్ సింగ్ బోస్ కమిటీ వ్యవస్థాపకులు జగన్ మాట్లాడుతూ నేటి యువత భగత్ సింగ్ ను ఆదర్శంగా తీసుకోవాలని తెలపడం జరిగినది. అదేవిధంగా జన విజ్ఞాన వేదిక నాయకులు పామిరెడ్డి వెంకట్రామిరెడ్డి , రంగనాథ్, శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్ గురు ,సుఖదేవ్ యొక్క త్యాగాలను తెలపడం జరిగినది. ఈ కార్యక్రమంలో హ్యాండ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రమేష్, భగత్ సింగ్ బోస్ కమిటీ రంగస్వామి, ఎమ్మెస్ జూనియర్ కళాశాల డైరెక్టర్ నిజాముద్దీన్, శ్రీ సాయి జూనియర్ కళాశాల కాంతారెడ్డి, గైడ్ రమేష్, హెచ్ఎం ఓబుల్ రాజు, ఉపాధ్యాయులు షామెల్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న బీఎస్పీ,ఎమ్మార్పీఎస్, దళిత సంఘాలనేతలు

# సేవ్ ఆర్డీటీ పాదయాత్ర విజయవంతం చేయండి

మాదిగ రక్షణ పోరాట సమితి పిలుపు..

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 23 :** పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణ కల్పించాలని కోరుతూ, ఏప్రిల్ 4 నుంచి చేపట్టనున్న సేవ్ ఆర్డీటీ పాదయాత్రను విజయవంతం చేయాలని ఏపీ మాదిగ రక్షణ పోరాట సమితి నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సోమవారం పుట్టపర్తిలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌ను కలిసి, పాదయాత్ర నిర్వహణకు అనుమతి కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఏప్రిల్ 4 నుంచి 9 వరకు బత్తలపల్లిలోని ఫాదర్ ఫెర్రర్ సమాధి నుంచి పుట్టపర్తి కలెక్టరేట్ వరకు ఈ పాదయాత్ర కొనసాగనుంది. నాయకులు మాట్లాడుతూ, దశాబ్దాలుగా వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఆర్డీటీ సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పాదయాత్రకు అనుమతి విషయంలో సానుకూలంగా స్పందించిన ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీతో పాటు వివిధ దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మడకశిర బార్ అసోసియేషన్ కార్యవర్గం

# మడకశిర బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా అశ్వర్థ నారాయణ ఏకగ్రీవ ఎన్నిక

**రొళ్ల (తెలుగోడు), మార్చి 23 :** మడకశిర బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా అశ్వర్థనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. మడకశిర బార్ అసోసియేషన్ ఎన్నికలు సోమవారం జరిగాయి. కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోన్నారు. ఇందులో బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా కే అశ్వర్థ నారాయణ ని, సెక్రెటరీగా ఉమేష్ చంద్ర ని ఉపాధ్యక్షులుగా హెచ్‌ఎస్ కిష్టప్ప జాయింట్ సెక్రెటరీ గా దివాకర్ ట్రెజరర్ గా నాగరాజు ని లైబ్రరీ ఇన్చార్జిగా రంగనాథ్ ని ఏకగ్రీవంగా ఎన్నుకోన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు గోవిందరాజులు హెచ్ ఎస్ నారాయణ గౌడ్ రాధాకృష్ణ సీఎం కరియణ్ణ శ్రీనివాసులు జె గోవర్ధన్ రెడ్డి లోకేష్ , నరసింహమూర్తి ఏజీపి గోవిందప్ప రవి రాజన్న మురళి కృష్ణ విజయ భాస్కర్ న్యాయవాదులు పాల్గొన్నారు



జంపన్నకు టిడిపి కండువా వేస్తున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

# టిడిపిలో చేరిన జంపన్న సోదరులు

**అగళి (తెలుగోడు), మార్చి 23 :** మండల పరిధిలోని హళ్ళికెర గ్రామానికి చెందిన జంపన్నతో అన్నదమ్ములు వైసిపికి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పసుపు కండువా కప్పి టిడిపిలోకి సాదరంగా ఆహ్వానించారు, ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి పట్ల ఆకర్షితులై పార్టీలో చేరామన్నారు. ఈ కార్యక్రమంలో రాజన్న, సీనియర్ నాయకులు డాక్టర్ కోడిపల్లి ఎన్ రమేష్,వీరేష్,రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## స్నపన తిరుమంజనం ఉత్సవం

**కదిరి (తెలుగోడు), మార్చి 23 :** ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఎల్లప్పుడు ఉండాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి ఆకాంక్షించారు. శ్రీ ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరో 20 ఏళ్లు కొనసాగాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కోరుకున్నారు. అంతకు ముందు శ్రీ మత్ ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి పవిత్ర బ్రహ్మోత్సవాలలో భాగంగా స్నపన తిరుమంజనం ఉత్సవం ( 16 రోజుల పండుగ) సందర్భంగా భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు మరియు జాతీయ కౌన్సిల్ సభ్యులు ఏర్పాటుచేసిన ,స్నపన తిరుమంజన ఉత్సవ ఉభయదారులు “శ్రీ విష్ణు వర్ధన్ రెడ్డి” గారి ఆత్మీయ ఆహ్వానం మేరకు సోమవారం పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర తో పాటు నియోజవర్గ కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



గేట్ 2026 ఫలితాల్లో మెరిసిన కే. కార్తీక్

# జాతీయస్థాయిలో 111వ ర్యాంక్

వెల్లువెత్తిన అభినందనలు..



కె. కార్తీక్

**అగళి (తెలుగోడు), మార్చి 23 :** గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్- 2026 ఫలితాల్లో అగళి మండలం కోడిపల్లి గ్రామానికి చెందిన కామన్న కార్తీక్ విశేష ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలోనే 111వ ర్యాంక్ సాధించారు. కోడిపల్లి గ్రామానికి చెందిన మాజీ గ్రామ అధ్యక్షుడు కామన్న మనవడు, అగళి మండల ప్రస్తుత ఎంపీపీ రేణుక కామరాజు తనయుడు కార్తీక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ విభాగంలో 803 గేట్ స్కోర్‌తో జాతీయ స్థాయిలో 111వ ర్యాంకు సాధించి ఇస్రో కంపెనీలో ఉద్యోగం కైవసం చేసుకున్నాడు. గ్రామీణ ప్రాంతానికి చెందిన కే. కార్తీక్ చిన్నప్పటి నుండి పట్టుదలతో చదువులో రాణించడం పట్ల అభినందనలు వెలువెత్తుతున్నాయి. కార్తీక్ తన విద్యను అనంతపురం లోని శ్రీ చైతన్య పాఠశాలలో విద్యనభ్యసించి పదవ తరగతిలో వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు 2020--2022 మధ్య విజయవాడలోని శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్(ఎంపీసీ) అభ్యసించారు. అనంతరం 2022--2026 లో కర్ణాటక రాష్ట్రం చిక్కబళ్లాపురంలోని శ్రీ ఆది చుంచునగిరి శిక్షణ ట్రస్ట్‌కు చెందిన ఎస్‌జెసి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలోఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఽ డేటా సైన్స్‌లో బీటెక్ పూర్తిచేశారు. కార్తీక్ సాధించిన ఈప్రతిష్ఠాత్మక విజయంపై కుటుంబ సభ్యులు,ముఖ్యంగా తాత కామన్న తల్లిదండ్రులు రేణుక,కామరాజు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ ఆది చుంచునగిరి శిక్షణ ట్రస్ట్ ప్రతినిధులు, కళాశాల ప్రిన్సిపల్,ఏఓ,అధ్యాపకులు,సిబ్బందితో పాటు తోటి విద్యార్థులు, బంధువులు, స్నేహితులు,మండల ప్రజలు కార్తీక్ కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భం గా కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ,కార్తీక్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి దేశానికి గౌరవం తీసుకురావాలని ఆకాంక్షించింది. అలాగే తల్లిదండ్రులు రేణుక, కామరాజు తమ కుమారుడు మరింత ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆశీర్వదిస్తూ, అతను భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి తన ఆశలు ఆశయాలు మరింత గొప్పగా కొనసాగాలని శుభాభినందనలు శుభాకాంక్షలు తెలిపారు.



తల్లిదండ్రులతో జాతీయస్థాయిలో 111వ ర్యాంకు సాధించిన కే కార్తీక్

# నిరుద్యోగ సమస్య పరిష్కారానికి జాబ్ క్యాలెండర్

బీజేపీ నేతలు..

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 23 :** తెలుగు సంవత్సరాది సందర్భంగా కూటమి ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కీలకమైన అడుగుగా బీజేపీ నాయకులు అభివర్ణించారు. సోమవారం బత్తలపల్లి మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో మంత్రి సత్య కుమార్ యాదవ్,మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు, సత్యసాయి జిల్లా బిజెపి అధ్యక్షుడు జిఎం. శేఖర్ సూచనలు మేరకు బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి సత్యకుమార్ యాదవ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. బీజేపీ యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గుండగల నరేష్, కార్యదర్శి సుదర్శన్ మాట్లాడుతూ, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. నిరుద్యోగుల ఆశలను నెరవేర్చే దిశగా జాబ్ క్యాలెండర్ ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబిలేసు, మండల అధ్యక్షుడు ఆకులేటి భాస్కర్, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి కోటి సుధా, బిజెపి నాయకులు తిరుపతయ్య, సాకే గోపాల్, బొంతల పోతలయ్య, కపాడం చందు, కోటి సురేష్, బొంతల ఉజ్జినప్ప తదితరులు పాల్గొన్నారు.



కూటమి నేతల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న బీజేవైఎం నాయకులు

# యూటీఫ్ రణభేరి -3 నిరాహార దీక్ష విజయవంతం చేయండి

యూటీఫ్ నాయకులు ..

**రొళ్ల (తెలుగోడు), మార్చి 23 :** పట్టణంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి ఎన్ మాలింగప్ప వై .జోగప్ప అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా యూటీఫ్ గౌరవాధ్యక్షులు కే. భూతన్న, జిల్లా కార్యదర్శి డి. నరసింహప్ప మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 22 నెలలు కావస్తున్న ఉద్యోగుల, ఉపాధ్యాయుల న్యాయబద్ధమైన డిమాండ్స్ అయిన పి ఆర్ సి కమిషన్ ఏర్పాటు, 29 శాతం ఐ ఆర్ , పెండింగ్ డిఏలను, బకాయిల చెల్లింపుకో రూట్ మ్యాప్ ను,సీపీస్ రద్దు, హెల్త్ కార్డ్ ఽమెడికల్ బిల్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలనే డిమాండ్స్ తో 24 న న మడకశిర తాలూకా కేంద్రం ఎదుట మధ్యాహ్నం 1-00 గంట నుంచి 5-00 గంటల వరకు నిరాహార దీక్షలు చేపట్టడం జరుగుతుంది. కనుక మడకశిర తాలూకాలోని యూటీఫ్ కామ్రేడ్స్ , ఉద్యోగ ఉపాధ్యాయులుఈ కార్యక్రమంలో పాల్గొని రణభేరి-3 ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. యూటీఫ్ తాలూకా సమన్వయకర్త టీ.మూడ్లగిరియప్ప, నరసింహమూర్తి, గుడిబండ అధ్యక్షులు ఈ.శివానాయక్,కె టి హనుమంతరాయ, నంజప్ప, మహంతేష్,సూర్య ప్రకాష్, దత్తాత్రేయ,దేవరాజు, వెంకటరమణ నాయక్, అశోక్, రవికుమార్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న యూటీఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె. భూతన్న



సన్నాహక సమావేశంలో పాల్గొన్న యూటీఫ్ నాయకులు

# ఉగాది కానుకగా జాబ్ క్యాలెండర్

ముదిగుబ్బలో నేతల సంబరాలు..

**ముదిగుబ్బ (తెలుగోడు), మార్చి 23 :** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఏపీ ప్రభుత్వం 2026 సంవత్సరానికి సంబంధించిన జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ యువతలో ఆనందం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా ముదిగుబ్బ మండలంలో కూటమి నేతలు సంబరాలు నిర్వహిస్తూ పీఎం మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్, సత్యకుమార్ యాదవ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

సోమవారం ముదిగుబ్బలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ అంజన్ రెడ్డి, జనసేన మండల కన్వీనర్ జయచంద్రతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం నేతల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ నిరుద్యోగ యువతకు ఉగాది కానుకగా నిలిచిందన్నారు. మొత్తం 10,060 ఖాళీల భర్తీకి ప్రణాళిక రూపొందించడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు విస్తరించనున్నాయని తెలిపారు. వివిధ శాఖల్లో దశలవారీగా నియామకాలు చేపట్టనున్నట్లు ప్రభుత్వం వెల్లడించిందని పేర్కొన్నారు. ప్రత్యేకంగా ఏపిపిఎస్‌సి ద్వారా గ్రూప్-1, గ్రూప్-2, పోలీస్, ఉన్నత విద్య, అటవీ, ఇంజనీరింగ్ తదితర విభాగాల్లో నియామకాలు జరగనున్నాయని తెలిపారు. మొత్తం 41 రకాల నోటిఫికేషన్లు మే 15 నుంచి అక్టోబర్ 15 వరకు విడుదల చేయనున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా మే 15న ఉన్నత విద్యాశాఖలో 1,500 పోస్టులు, సెప్టెంబర్ 15న గ్రూప్-2 కింద 750 పోస్టులకు నోటిఫికేషన్ వెలువడనుందని పేర్కొన్నారు.

రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పారదర్శక నియామకాల ద్వారా యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేసినట్లు తెలిపారు. ఈ జాబ్ క్యాలెండర్ రాష్ట్ర యువత భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తుందని, ప్రభుత్వంపై నమ్మకాన్ని పెంచుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో మాలపాటి రామకృష్ణ, ఇందుకూరు ఓబిరెడ్డి, కొలసాని చంద్ర, గొర్తి నందా, మల్లెల నారాయణస్వామి, రెడ్డప్ప, హరి, నరసింహనాయుడు, జెబి ఉల్లా, సోంపల్లి మనోహర్ నాయుడు, బాలరాజు, రాఘవ, శ్రీనివాసులు, మహమ్మద్ రఫీ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తుమ్మల మనోహర్



తుమ్మల మనోహర్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేస్తున్న దృశ్యం



చలివేంద్ర ప్రారంభిస్తున్న దృశ్యం

# సర్పంచ్ భారతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

**నల్లమాడ (తెలుగోడు), మార్చి 23 :** వేసవి తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న వేళ ప్రజల దాహార్తిని తీర్చేందుకు నల్లమాడ సర్పంచ్ రమావత్ భారతి ముందడుగు వేసి ఆదర్శంగా నిలిచారు. నల్లమాడ పట్టణంలోని సత్యమ్మ దేవాలయం వద్ద ఎప్పుడూ రద్దీగా ఉండే ప్రాంతంలో చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు. ప్రస్తుతం పదవ తరగతి పరీక్షలు జరుగుతుండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో నల్లమాడకు వస్తుండగా, మంచినీటి కొరత తీవ్రంగా ఉందని గుర్తించిన సర్పంచ్ వెంటనే చర్యలు చేపట్టి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయించడం విశేషం.

ఎండ తీవ్రతను లెక్కచేయకుండా ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ముందుకొచ్చిన రమావత్ భారతి ఈ కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించి పూర్తి చేయించారు. ఆమె తీసుకున్న ఈ నిర్ణయం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా ఉపశమనం పొందుతున్నారు. గ్రామస్థులు సర్పంచ్ సేవాస్ఫూర్తిని కొనియాడుతూ అభినందనలు తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కుటాలపల్లి ఎంపియుపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమావత్ చాంప్లా, నాయక్ బుట్టి నాగభూషణ, ఆర్ నితీష్ కుమార్ నాయక్, పాపారాయుడు, ఏవో శ్రీనివాసులు రెడ్డి, పంచాయతీ కార్యదర్శి దాదాసాహెబ్, ఎం రవి, ఆర్ రవి, విశ్రాంత ఏఎస్ఐ లక్ష్మన్న సోము తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజల సమక్షంలో చలివేంద్రాన్ని ప్రారంభించి అందరికీ అందుబాటులో ఉంచారు.



పుట్టపర్తిలోని కలెక్టరేట్లో సమస్యను అధికారులకు తెలియజేస్తున్న దృశ్యం

# బిల్లుల నిలిపివేతపై ఆగ్రహం

మంత్రి బిల్లులు రాకుండా చేశారని కలెక్టరేట్లో ఫిర్యాదు..

**పుట్టపర్తి (తెలుగోడు), మార్చి 23 :** పుట్టపర్తి జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా వైఎస్ఆర్సిపి ప్రధాన కార్యదర్శి ఆవుటాల రమణారెడ్డి ఆధ్వర్యంలో సోమందేపల్లి మండలానికి చెందిన పలువురు సర్పంచులు బిల్లుల నిలిపివేతపై ఫిర్యాదు చేశారు. గత రెండు సంవత్సరాలుగా పంచాయతీ తీర్మానాలతో, అన్ని అనుమతులు పొందిన అనంతరం గ్రామాల్లో పారిశుధ్యం పనులు, త్రాగునీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల కోసం ఖర్చు చేసిన నిధులను డ్రా చేయకుండా అడ్డుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి సవితమ్మ ఆదేశాల మేరకు ఈ బిల్లులు నిలిపివేయబడ్డాయని, కేవలం వైఎస్ఆర్సిపి సానుభూతిపరులనే లక్ష్యంగా చేసుకుని ఈ చర్యలు తీసుకున్నారని ఆవుటాల రమణారెడ్డి తీవ్రంగా ఆరోపించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కోసం ఖర్చు చేసిన డబ్బులను నిలిపివేయడం అన్యాయమని, వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించిన ఆవుటాల రమణారెడ్డి, సర్పంచులతో కలిసి న్యాయం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్, విషయాన్ని సమగ్రంగా పరిశీలించి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సోమందేపల్లి మండల మాజీ కన్వీనర్ నారాయణరెడ్డి, కేతగానిగాని చెరువు సర్పంచ్ రామాంజనేయులు, చాలకూరు పంచాయతీ సర్పంచ్ లక్ష్మీనరసింహ, వెలిదడకల సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, జూలుకుంట సర్పంచ్ నాగరత్నమ్మ, తొంగోడు సర్పంచ్ ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి రైతునూ ఆదుకుంటాం.. అధైర్యపడొద్దు

అనంతసాగరం మండలంలో దెబ్బతిన్న పంటల పరిశీలన..
మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**ఆత్మకూరు (తెలుగోడు), మార్చి 23 :** పంట నష్టపోయిన ప్రతిఒక్క రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందని, ప్రతి సెంటు భూమికి నష్టపరిహారం చెల్లిస్తామని రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హామీ ఇచ్చారు. అనంతసాగరం మండలంలోని చిలకలమర్రి, కామిరెడ్డిపాడు, మంగుపల్లి గ్రామాల్లో ఇటీవల కురిసిన వడగండ్ల వానకు దెబ్బతిన్న వరి, పత్తి, మిరప తదితర పంటలను మంత్రి రైతులు, అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా చేతికి వచ్చిన పంట పూర్తిగా నష్టపోయిందని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేయగా, ప్రతి రైతును ఆదుకుంటామని మంత్రి భరోసా ఇచ్చి ఓదార్చారు. అనంతరం అనంతసాగరం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వ్యవసాయ, ఉద్యానవన, రెవెన్యూ శాఖల అధికారులు పంట నష్టం వివరాలను మంత్రికి తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యం కారణంగా అనంతసాగరం, మర్రిపాడు, కలువాయి, రాపూరు, సీతారాంపురం, లింగసముద్రం మండలాల్లోని 21 గ్రామాల్లో 1469 మంది రైతులు సుమారు 1289 హెక్టార్లలో పంటలను నష్టపోయినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిపారు. అనంతసాగరం మండలంలోనే అత్యధికంగా 1054 హెక్టార్లలో పంట నష్టం సంభవించిందని, ముఖ్యంగా వరి పంట తీవ్రంగా దెబ్బతిన్నదని మంత్రి తెలిపారు. మొక్కజొన్న, మిరప, నిమ్మ, పొగాకు పంటలు కూడా కొంత మేర ప్రభావితమయ్యాయని చెప్పారు. రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో తక్షణమే కచ్చితమైన ఎన్యుమరేషన్ పూర్తి చేసి నివేదికను కలెక్టర్‌కు అందించాలని అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపించి, మార్గదర్శకాల మేరకు సకాలంలో నష్టపరిహారం అందిస్తామని పేర్కొన్నారు. కౌలు రైతులను కూడా ఆదుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చన్నాయుడులతో పంట నష్టం అంశంపై చర్చించామని, రైతులకు సహాయం చేయడంలో వారు సానుకూలంగా స్పందించారని మంత్రి తెలిపారు. రైతులు ఎవరు అధైర్యపడొద్దని, వారి కష్టానికి తప్పకుండా న్యాయం చేసి త్వరలోనే నష్టపరిహారం అందజేస్తామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి నర్సోజి రావు, ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, ఆర్డీవో పావని, తహసీల్దార్ పద్మజ, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



అకాల వర్షాలకుదెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న మంత్రి ఆనం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ బీవీ. జయ నాగేశ్వర రెడ్డి

## మహిళల ఆస్తి హక్కుకు సంబంధించిన విషయం

**ఎమ్మెల్యే డాక్టర్ బీవీ. జయ నాగేశ్వర రెడ్డి ..**

**ఎమ్మిగనూరు (తెలుగోడు), మార్చి 23 :**
"ఇది మహిళల ఆస్తి హక్కులకు సంబంధించిన విషయం అని, జగన్ రెడ్డి కుటుంబానికి మాత్రమే చెందిన వ్యక్తిగత సమస్య కాదు" అని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ. జయ నాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మిగనూరు పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో విజయమ్మ లేఖపై స్పందిస్తూ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ. జయ నాగేశ్వర్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి పాలన సమయంలో రూ. 43 వేల కోట్ల ఆస్తులు సంపాదించిన జగన్ రెడ్డి, చట్టప్రకారం తన తలి, చెల్లికి సమాన హక్కులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. మహిళల ఆస్తి హక్కులు రక్షితంగా ఉండాలంటే మహిళా లోకం జగన్‌ను నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల ధనం, మానం, ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత నాయకులపై ఉంటుందని, అలాంటి విలువలు లేని వారికి రాజకీయాల్లో ఉండే అర్హత ఉందా అని ప్రశ్నించారు.సునీతకు అండగా నిలిచి మహిళల ధన, మాన, ప్రాణాలు మరియు ఆస్తి హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. తల్లి, చెల్లిని గౌరవించే భారతీయ సంస్కృతి సంప్రదాయాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని తెలిపారు.సాక్ష్యాధారాలను ధ్వంసం చేయడం భారతీయ శిక్షాస్మృతి (భాజ) ప్రకారం తీవ్రమైన నేరమని పేర్కొన్నారు. ప్రజలకు న్యాయం చేయాల్సిన వ్యక్తి ముందుగా తన కుటుంబానికి న్యాయం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి వ్యాఖ్యానించారు.
2004లో తన ఆస్తి రూ. 1.74 కోట్లు మాత్రమేనని ప్రకటించిన జగన్ రెడ్డి, తరువాత తన తండ్రి అధికారాన్ని ఉపయోగించుకుని భారీ స్థాయిలో అక్రమ ఆస్తులు సంపాదించారని సీబీఐ న్యాయస్థానంలో చార్జ్‌షీట్లు దాఖలు చేసిన విషయాన్ని ప్రస్తావించారు.తన పాలనలో మద్యం కుంభకోణంలో రూ. 3,500 కోట్ల అక్రమాలు జరిగినట్లు సిట్ గుర్తించిందని, టీటీడీ లడ్డూ వ్యవహారం సహా అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయని ఎమ్మెల్యే విమర్శించారు.ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ మహిళా నాయకులు, టీడీపీ పట్టణ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువతకు స్ఫూర్తి భగత్ సింగ్ జీవితం

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 23 :**
స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ జీవితం దేశంలోని యువతకు స్ఫూర్తి ప్రదాయకమని డీవైఎఫ్ఐ నాయకులు రాజేంద్ర, గురుస్వామి, గోవిందు పేర్కొన్నారు. సోమవారం పెద్దకడబూరు మండల పరిధిలోని నౌలేకల్ గ్రామంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం తన యవ్వనాన్ని త్యాగం చేసి, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన మహనీయుడు భగత్ సింగ్ అని కొనియాడారు. ఆయన దేశభక్తి, త్యాగస్ఫూర్తి, నిర్భయ ధైర్యం ప్రతి యువకుడికి ఆదర్శమని తెలిపారు. భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో భగత్ సింగ్ చేసిన త్యాగాలు చిరస్మరణీయమని, ఆయన చూపిన మార్గంలో నడవడం ద్వారా సమాజంలో న్యాయం, సమానత్వం నెలకొల్పవచ్చని పేర్కొన్నారు. యువత దేశాభివృద్ధికి కృషి చేస్తూ, సమాజంలో మంచి మార్పులకు దారితీయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు, డీవైఎఫ్ఐ కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొని భగత్ సింగ్ సేవలను స్మరించుకున్నారు.



భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

## టీచర్ కుటుంబానికి రూ. 5 వేలు సాయం

**కోసిగి (తెలుగోడు), మార్చి 23 :**
కోసిగి మౌంట్ కార్మెల్ స్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్న .మాణిక్యమ్మ సోమవారం తెల్లవారుజామున ఆకస్మికంగా మృతి చెందిన విషయం తెలుసుకున్న కోసిగి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అయ్యమ్మ వారి కుటుంబానికి సంతాపం తెలియజేసిస్తూ 5 వేల రూపాయలు ఆర్థిక సహాయన్ని సర్పంచ్ తండ్రి మాణిక్యరాజు, అన్న రాజేష్ లు మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.



మృతురాలి కుటుంబానికి 5 వేలు ఆర్థిక సహాయం అందజేస్తున్న సర్పంచ్ తండ్రి మణిక్యరాజు, అన్న రాజేష్

# భారత్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం ఆకస్మిక తనిఖీ

**అపోహలు నమ్మవద్దు..**
**సరఫరాలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు..**
**తహసీల్దార్ గీతా ప్రియదర్శిని..**

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 23 :**
పెద్దకడబూరు గ్రామంలోని భారత్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాన్ని మండల తహసీల్దార్ గీతా ప్రియదర్శిని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్యాస్ సరఫరాపై ఇటీవల కొన్ని అపోహలు, ఫిర్యాదులు వినిపిస్తున్న నేపథ్యంలో ఆమె స్వయంగా ఏజెన్సీని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులు, గ్యాస్ బుకింగ్ వివరాలు, పంపిణీ రిజిస్టర్లు తదితర పత్రాలను పరిశీలించి సరఫరా విధానంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లు సమయానికి అందుతున్నాయా, బుకింగ్ చేసిన తర్వాత ఎలాంటి ఆలస్యం జరుగుతుందా అనే విషయాలను వివరంగా తెలుసుకున్నారు. గ్యాస్ సరఫరా విషయంలో బయట ప్రచారంలో ఉన్న పుకార్లు, అపోహలను ప్రజలు నమ్మవద్దని తహసీల్దార్ గీతా ప్రియదర్శిని సూచించారు. గతంలో మాదిరిగానే వినియోగదారులు గ్యాస్ బుక్ చేసుకుంటే సరఫరా జరుగుతుందని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సేవలు అందించాలని ఏజెన్సీ సిబ్బందికి ఆదేశించారు. అలాగే ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చే పరిస్థితి ఏర్పడకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. సరఫరాలో నిర్లక్ష్యం, అవకతవకలు లేదా ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలు జరిగితే సంబంధితులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రజలకు అందించే అవసర సేవల విషయంలో ఎలాంటి లోపాలు ఉండకూడదని, ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులు, సిబ్బంది పనిచేయాలని ఈ సందర్భంగా తహసీల్దార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జెర్మియా, ఏఎస్ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



భారత్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన తహసీల్దార్ గీతా ప్రియదర్శిని

# గ్రామ సర్పంచులకు సన్మానం

**ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి..**

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 23 :**
పెద్దకడబూరు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులను మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సోమవారం ఘనంగా సన్మానించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచులకు శాలువాలు కప్పి సత్కరించారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామస్థాయి సమస్యలను పరిష్కరించడంలో ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు గ్రామ పంచాయతీ స్థాయిలో సమర్థవంతంగా పని చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బాపులదొడ్డి గ్రామ సర్పంచ్ చిన్న మహదేవ తన కూతురి వివాహ ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి అందజేశారు. అనంతరం సర్పంచులు చిన్న మహదేవ, నాగరాజు, హనుమంతు, ఇస్మాయిల్ తోపాటు వైసీపీ నాయకులు శివరాం, మూకిరెడ్డి, కేపీ యల్లప్ప, మహదేవలను ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. వైసీపీ నాయకులు నల్లారెడ్డి, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.



గ్రామ సర్పంచులను సన్మానించిన ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



గ్రామ సర్పంచ్ చిన్న మహదేవ కూతురి వివాహ ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యేకు అందజేస్తున్న దృశ్యం

# గవిగట్టులో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

**ఉపాధి హామీ పథకం కింద**
**గ్రామాభివృద్ధికి మరో అడుగు ..**

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 23 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని గవిగట్టు గ్రామంలో మంత్రాలయం టీడీపీ ఇన్ చార్జ్ రాఘువేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు ఉపాధి హామీ పథకం కింద నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి టీడీపీ నాయకులు సోమవారం భూమిపూజ నిర్వహించారు. మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ రాఘువేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు ఉప్పర బసయ్య, ఉప్పర మునిస్వామి, బజారి, బంగారయ్య మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఉండేలా సీసీ రోడ్లు, కాలువలు, తాగునీటి సదుపాయాలు వంటి అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. గవిగట్టు గ్రామంలో నిర్మించనున్న ఈ సీసీ రోడ్డు పూర్తయితే గ్రామ ప్రజలకు ఎంతో సౌలభ్యం కలుగుతుందని, ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాల ద్వారా గ్రామాలు మరింత అభివృద్ధి చెందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గవిగట్టులో సీసీ రోడ్డు నిర్మాణానికి చేస్తున్న టీడీపీ నాయకులు

## షహీద్ దివస్

**గుంటూరు,మార్చి 23:**
గుంటూరు,ప్రభుత్వ మహిళా కళాశాల సంయుక్త ఆద్వర్యంలో షహీద్ దివస్ సందర్భంగా గుంటూరులోని ప్రభుత్వ మహిళా కళాశాలలో దేశభక్తి ఉత్సాహంతో పాదయాత్రను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భారత స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్,రాజ్‌గురు, సుఖ్‌దేవ్ థాపర్‌లకు ఘన నివాళులు అర్పించారు.



టీచర్ మాణిక్యమ్మ (ఫైల్ ఫోటో)

## ప్రైవేటు స్కూలు టీచర్ ఆకస్మిక మృతి

**కోసిగి (తెలుగోడు), మార్చి 23 :**
కోసిగిలోని మౌంట్ కార్మెల్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్న 9 వార్డుకు చెందిన పెద్దహుల్తీ మాణిక్యమ్మ (35)సోమవారం తెల్లవారుజామున ఆకస్మికంగా మృతిచెందారు. మాణిక్యమ్మ బిఎస్సి బీఈడీ వరకు చదివి గవర్నమెంట్ ఉద్యోగం కోసం ఒక వైపు ప్రయత్నం చేస్తూనే గత 10 సంవత్సరాలుగా, మౌంట్ కార్మెల్ స్కూల్లో టీచర్‌గా ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఎప్పుడైనా ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తానని ధీమాగా ఉన్న మాణిక్యమ్మ అకస్మాత్తుగా మృతిచెందటంతో కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేక కన్నీరుమున్నీరుగా విలపించారు. మాణిక్యమ్మ మృతితో మౌంట్ కార్మెల్ పాఠశాల యాజమాన్యం సంతాపం తెలియజేస్తూ పాఠశాలకు సైతం ఒకరోజు సెలవు ప్రకటించారు. మృతురాలు కి భర్త చిన్న రంగన్న తోపాటు ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు.తల్లి మృతి ని తట్టుకోలేక చిన్న పిల్లలు ఏడుస్తున్న తీరు పలువురిని కలించి వేసింది. ప్రభుత్వం మాణిక్యమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఏపీ మోడల్ స్కూల్‌లో టెన్త్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ గీతా ప్రియదర్శిని

## పదవ తరగతి పరీక్ష కేంద్రం ఆకస్మిక తనిఖీ

**తహసీల్దార్ గీత ప్రియదర్శిని..**

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 23 :**
పెద్దకడుబూరు గ్రామంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రాలను మండల తహశీల్దార్ గీత ప్రియదర్శిని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్తానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూళ్లలో జరుగుతున్న టెన్త్ పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా హెడ్‌మాస్టర్, చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంటల్ అధికారులతో మాట్లాడి పరీక్షల నిర్వహణపై పలు సూచనలు చేశారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ఎలాంటి లోపాలు లేకుండా పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ జెర్మియా, ఎంఈఓ - 1 ఉస్మాన్ బాషా తదితరులు

# అట్టహాసంగా నూతన గృహప్రవేశ వేడుకలు

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 23 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని చిన్నతుంబలం గ్రామంలో వడ్డే భీముడు నూతన గృహప్రవేశ కార్యక్రమం సోమవారం అట్టహాసంగా జరిగింది. కుటుంబ సభ్యులు, బంధువుల సమక్షంలో పూజా కార్యక్రమాలతో ఈ వేడుక ఉత్సాహభరితంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైస్ ఎంపీపీ తనయుడు, వైసీపీ రైతు విభాగం తాలూకా అధ్యక్షులు కేపీ యల్లప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా కేపీ యల్లప్ప వడ్డే భీముడు కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, కొత్త ఇంటిలో వారు సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. నూతన గృహ ప్రవేశ వేడుకలో వైసీపీ నాయకులు బాపురం హనుమంతరెడ్డి, మదిరి రాముడు, హరిజన బొడ్డన్న, బారికి మల్లయ్య, బుడజగ్గుల ఈరన్న, ఆటో నాగేష్, వైసీపీ వాలంటీర్స్ విభాగం మండల అధ్యక్షుడు కమ్మరి నరసింహ ఆచారి, వడ్ల ఈరన్న, వైసీపీ ఇంటెలెక్చువల్ విభాగం మండల అధ్యక్షుడు కమ్మరి బ్రహ్మయ్య, హరిజన రేణుకప్ప తదితరులు పాల్గొన్నారు.



వడ్డే భీముడిని సన్మానిస్తున్న దృశ్యం





ఇష్ట దైవాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం. వడ్డే భీముడి నూతన గృహాన్ని ప్రారంభిస్తున్న వైసీపీ నేతలు

# ఇండియన్ ఉమెన్స్ లీగ్‌లో జంపాపురం సావిత్రి విజయయాత్ర

**ఆటో డ్రైవర్ కుమార్తె నుండి**
**జాతీయ క్రీడాంగణ నక్షత్రం వరకు..**
**ఒక చిన్న గ్రామం నుండి**
**జాతీయ వేదిక వరకు..**

**కోసిగి (తెలుగోడు), మార్చి 23 :**
కోసిగి మండలం జంపాపురం గ్రామానికి చెందిన గుడ్డెగారి సావిత్రి ఒక సాధారణ ఆటో డ్రైవర్ కుమార్తె ఇండియన్ వుమెన్స్ లీగ్ (ఐ డబ్ల్యూ ఎల్-2) ఫుట్‌బాల్ టీమ్‌లో ఎంపికైంది. ఈ విజయం కేవలం ఆమె సాధన మాత్రమే కాదు, కుటుంబ ఏకతాంశం, గ్రామీణ పోరాటం యొక్క చిహ్నం. 1వ తరగతి నుండి ఐ డబ్ల్యూ ఎల్ -2 వరకు ఆమె యాత్ర గ్రామీణ యువతకు ప్రేరణగా నిలిచింది. కుటుంబ నేపథ్యం ఒక సారి పరిశీలిస్తే కష్టాల మధ్య ఆశల కాంతి గుడ్డెగారి బస్సప్ప మరియు శారదమ్మ దంపతులుకు నలుగురు కూతుర్లకు తల్లిదండ్రులు. తండ్రి ఆటో నడుపుతూ కుటుంబ ఖర్చులు చూసుకుంటారు. "నా కూతుర్లు చదువుకోవాలి, ఉన్నత స్థాయిలో ఉండాలి" అనే ఆశతో రోజూ కష్టపడతారు. తల్లి శారదమ్మ ఇంటి పనులతో పాటు చిన్న చిన్న పనులు చేసి సహాయపడతారు.
కుటుంబంలో పెద్ద కూతురు సువర్ణ వివాహం అయి స్థిరపడింది. రెండో కూతురు శైలజ కు ఇటీవల పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది ఇది కుటుంబానికి మొదటి పెద్ద విజయం. మూడో కూతురు సావిత్రి ఐ డబ్ల్యూ ఎల్ -2 లో ఎంపికైంది. చిన్న కూతురు ఇప్పుడు డిగ్రీ చదువుతోంది. ఈ నలుగురు కూతుర్లు కష్టాల మధ్య పెరిగి, ప్రతి ఒక్కరూ వారసత్వాన్ని మార్చుకున్నారు. బసప్ప చెప్పినట్లు, "ఆటోలో కష్టపడి పెట్టిన డబ్బు ఇప్పుడు ఫలితం ఇస్తోందని అంటున్నాడు

***సావిత్రి విద్యాభ్యాసం..***
***జంపాపురం గ్రామం నుండి హైదరాబాద్ వరకు..***

సావిత్రి 1వ తరగతి నుండి 4వ తరగతి వరకు గ్రామ పాఠశాలలో చదివింది. ఆమెకు స్పోర్ట్స్ పైన ఆసక్తి ఉండటం తో 5 వ తరగతి నుండి తల్లిదండ్రులు హైదరాబాద్ లో స్పోర్ట్స్ స్కూల్ చేర్చటం. జరిగింది అక్కడ హాస్టల్ లో ఉంటూ, డిగ్రీ వరకు విద్యాభ్యాసం పూర్తి చేసింది. హైదరాబాద్‌లో మొదట భయం వచ్చింది, కానీ తండ్రి డబ్బు పంపిస్తూ ప్రోత్సహించాడు" .విద్యతో పాటు ఫుట్‌బాల్ పట్ల ఆమె అభిరుచి బాల్యంలోనే మొదలైంది. గ్రామంలో అమ్మాయిలు ఫుట్‌బాల్ ఆడటం అసాధారణం. కానీ సవిత్రి "అమ్మాయిలు ఫుట్‌బాల్ ఆడకూడదు" అని చుట్టుపక్కలవారు చెప్పినా, తల్లిదండ్రులు ప్రోత్సహించారు. హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతూ, స్థానిక క్లబ్‌ల్లో ఆడటం మొదలుపెట్టింది.

***డికెఆర్ ఫుట్‌బాల్ అకాడమీ కోచ్ నాగరాజు మార్గదర్శకత్వం..***
సావిత్రి ఫుట్ బాల్ కెరీర్‌లో మలుపు తిరిగింది. డి కె ఆర్ ఫుట్‌బాల్ అకాడమీలో. హైదరాబాద్‌లోని ఈ అకాడమీ తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి. కోచ్ నాగరాజు ఒక అనుభవజ్ఞుడుగా సావిత్రిని గుర్తించారు. "ఆమెలో స్పీడ్, స్టామినా, టీమ్ స్పిరిట్ ఉన్నాయి" అని నాగరాజు చెప్పారు. అకాడమీలో రోజూ 4 గంటల శిక్షణ -- ఫిట్‌నెస్, డ్రిబ్లింగ్, షూటింగ్, ట్యాక్టిక్స్. సావిత్రి చదువుతూ, శిక్షణ చేస్తూ సమతుల్యం పాటించింది.

***కోచ్ నాగరాజు శిక్షణ పద్ధతి ప్రత్యేకం..***
"మహిళల ఫుట్‌బాల్‌లో మెంటాలిటీ ముఖ్యం. సావిత్రి దాన్ని చాటింది, అకాడమీలో ఆమె డిఫెన్డర్‌గా మొదలై, మిడ్‌ఫీల్డర్‌గా మారింది. స్టేట్ లెవల్ మ్యాచ్‌ల్లో తన ఆట ఆకర్షించింది. ఈ శిక్షణే ఐ డబ్ల్యూ ఎల్-2 ట్రయల్స్‌కు దారితీసింది.

***ఐ డబ్ల్యూ ఎల్ 2 ..***
ఇండియా ఫుట్‌బాల్ అసోసియేషన్ నిర్వహించే ఈ లీగ్ మహిళల ఫుట్‌బాల్‌ను ప్రోత్సహిస్తుంది. ఈ ఏడాది 14 టీమ్‌లు పాల్గొంటున్నాయి. ఈ నెల 22 నుండి 30 వరకు కేరళ లోని కార్పొరేషన్ స్టేడియం త్రిశూర్ లో ఈ లీగ్ కొనసాగుతుంది.సావిత్రి ఆడుతున్న టీమ్ గ్రూప్ బిలో ఉంది.



ఇండియన్ ఉమెన్స్ లీగ్‌లో విజయం సాధించిన జంపాపురం సావిత్రి

***కుటుంబ ప్రతిఫలం..***
ఐ డబ్ల్యూ ఎల్ -2 ఎంపిక వార్త తెలిసిన వెంటనే చాలా సంతోషంతో ఉన్నారు ,జంపాపురంలో గ్రామస్తులు ఈ విషయం తెలుసుకొని అభినందించారు.తండ్రి బస్సప్ప , తల్లి శారదమ్మ కష్ట ఫలలే సావిత్రి కి గెలుపు మెట్టు అయ్యింది. తండ్రి ముందు ఆడ పిల్లలకు చదువు ఆటలు ఎందుకు అన్నా మాటలే ఇప్పుడు, మూగబోయేల, పట్టుదలతో ఈ స్థాయికి వెళ్ళడానికి గమనార్హం

***ప్రతిభావికాసం..***
సవిత్రి యాత్ర సులభం కాదు. గ్రామంలో అమ్మాయిలు స్పోర్ట్స్ ఆడకూడదనే మనస్తత్వం, డబ్బు లేకపోవటం, హైదరాబాద్‌లో ఒంటరిగా ఉండటం, అన్నీ సవాళ్లు. కానీ, కుటుంబ సపోర్ట్‌తో దాటింది. ఇలాంటి విజయాలతో ముందుకు సాగాలి, గ్రామీణ యువతకు స్ఫూర్తి సావిత్రి విజయం, ఇలాంటి మట్టిలో మాణిక్యాలు గ్రామంలో చాల మంది ఉన్నారు, అలాంటి వారిని తల్లిదండ్రులు ప్రోత్సహించాలి.

# నాపేరుతో ఎలాంటి వ్యాపారాలు లేవు.. మంగ్లీ




ప్రఖ్యాత ఫోక్ సింగర్ మంగ్లీ పేరుతో మైక్రో ఫైనాన్స్ వ్యాపారం జరుగుతోందని వస్తున్న వార్తలపై ఆమె ఘాటుగా స్పందించారు. తనకు అలాంటి వ్యాపారాలతో సంబంధం లేదని స్పష్టం చేస్తూ, సోషల్ మీడియా వేదికగా ఓ అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కొందరు వ్యక్తులు మంగ్లీ పేరును ఉపయోగిస్తూ మైక్రో ఫైనాన్స్ పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారనే వార్తలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆమె స్పందిస్తూ, ‘నా పేరుతో డబ్బులు సేకరిస్తున్నారని వస్తున్న వార్తలు పూర్తిగా అసత్యం. నాకు ఆ వ్యక్తులతో గానీ, వార్ి÷నాన్స్ వ్యాపారాలతో గానీ ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. మంగ్లీ తన ప్రకటనలో , తనను మరియు తన కుటుంబ సభ్యులను చాలా మంది ప్రొఫెషనల్ ఈవెంట్స్ కోసం సంప్రదిస్తుంటారని చెప్పారు. అయితే, ఆ ఈవెంట్స్‌కు సంబంధించిన ఆహ్వానాల వరకే తమకి పరిచయం ఉంటుందని, వారి వ్యక్తిగత వ్యాపారాల గురించి తాము ఎలాంటి బాధ్యత వహించబోమని స్పష్టం చేశారు. అలాగే, తన పేరును ఉపయోగించి మోసాలకు పాల్పడటం అన్యాయమని, ఇది తన వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కరెన్సీ వీడియోలు,÷నాన్స్ వ్యవహారాలకు తమ కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని ఆమె మరోసారి క్లియర్ చేశారు.ఎవ్వరైనా నా పేరు చెప్పి డబ్బులు అడిగితే దయచేసి నమ్మకండి. అలాంటి మోసాలకు గురైన వారికి న్యాయం చేయాలని పోలీస్ శాఖను కోరుతున్నాను అని మంగ్లీ విజ్ఞప్తి చేశారు. ఈ ప్రకటనతో, మంగ్లీ పేరును వాడుకొని జరుగుతున్న మోసాలపై ప్రజల్లో అవగాహన పెరిగే అవకాశం ఉంది.ఇదిలా ఉంటే ఇటీవల మంగ్లీ పాన్-ఇండియా చిత్రం ఐఆ: ది డెవిల్ సినిమా కోసం ఒక పాట పాడింది. ’సర్కే చునర్ తేరి సర్కే’ పాటలో డబుల్ మీనింగ్ లిరిక్స్ ఉన్నాయనే ఆరోపణలతో సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.ఈ క్రమంలో మంగ్లీ సోషల్ మీడియాలో స్పందిస్తూ? ’ప్రజల భావోద్వేగాలను గౌరవిస్తూ ఈ పాటను తొలగించాం. అనుకోకుండా జరిగిన పొరపాటుకు హృదయపూర్వక క్షమాపణలు’ అని తెలిపారు.

# రౌడీ జనార్ధన్ మూవీ కోసం విజయ్ కసరత్తు

టాలీవుడ్ యాక్టర్ విజయ్ దేవరకొండ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడు. వీటిలో ఒకటి రాహుల్ సంకీర్త్యన్‌తో చేస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా. విజయ్ మరోవైపు దిల్ రాజు నిర్మాణంలో రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఓ రూరల్ మాస్ డ్రామాకు కమిటవగా.. ఈ చిత్రానికి రౌడీ జనార్ధన అనే టైటిల్ కూడా ఖరారు చేశారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో గ్రాండ్ స్కేల్‌లో ఉండబోయే యాక్షన్ సీక్వెన్స్‌ను విజయ్ టీం డిజైన్ చేస్తుందట. ముంబై స్లమ్స్ ఏరియాలో రాబోయే హై ఆక్టేన్ ఫైట్ సీక్వెన్స్ సినిమాకే హైలెట్‌గా నిలువబోతుందట. ఇంటెన్స్, రియలిస్టిక్ యాక్షన్ ఎక్స్‌పీరియన్స్ అందించేలా ఈ ఎపిసోడ్ ఉండనుందిని ఇన్‌సైడ్ టాక్. ఇప్పటికే విజయ్ దేవరకొండ ట్రాన్స్‌ఫార్మేషన్ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేస్తుంది. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో రియల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రంలో విజయ్ పాత్ర పేరు జనార్ధన్ కాగా, ఆయన నాన్న పేరు కూడా జనార్ధనేనని ఇన్‌సైడ్ టాక్. విజయ్ దేవరకొండకు ’రౌడీ’ అనే ట్యాగ్ ఎప్పటి నుంచో ఉంది. ఇప్పుడు రౌడీ టైటిల్‌తో సినిమా వస్తుండడంతో ఫ్యాన్స్ అంతా ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఈ సినిమాతో విజయ్ తన విశ్వరూపం చూపించనున్నాడని కామెంట్ చేస్తున్నారు.




# రీ ఎంట్రీ ఇస్తున్న నటి రోజా



తమిళ సినీ పరిశ్రమలో సీనియర్ నటీమణుల రీఎంట్రీ ట్రెండ్ కొనసాగుతోంది. ఇటీవల శోభన తిరిగి కోలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. ఇప్పుడు మరో ఫైర్‌బ్రాండ్ నటి, రాజకీయ నాయకురాలు ఆర్కే రోజా కూడా మళ్లీ తమిళ సినిమాల్లో బిజీ అవుతున్నారు. గత కొంతకాలంగా రాజకీయాల్లో చురుకుగా ఉన్న రోజా, ప్రస్తుతం సినిమాలపై మళ్లీ ఫోకస్ పెట్టారు. 12 ఏళ్ల విరామం తర్వాత ఆమె తమిళ ఇండస్ట్రీలోకి రీఎంట్రీ ఇస్తుండటం విశేషం. ఇప్పటికే ఆమె నటించిన లెనిన్ పాండ్యన్ షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది.ఇదే సమయంలో రోజా నటిస్తున్న మరో చిత్రం అన్బే దయానా కోలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. పారి ఎలవళగన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో రమ్య రంగనాథన్ హీరోయిన్‌గా కనిపించ నున్నారు. చెన్నైలోని పెరంబూర్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ రొమాంటిక్ లవ్ స్టోరీలో రోజా కీలక పాత్రలో, ముఖ్యంగా హీరో తల్లి పాత్రలో కనిపించబోతున్నారు. ఇటీవల ఈ సినిమా నుంచి విడుదలైన ’పెరంబూర్ గానా’ సాంగ్ మంచి స్పందన అందుకుంటోంది. ముఖ్యంగా ఈ పాటలో రోజా చేసిన మాస్ స్టెప్పులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. చాలా గ్యాప్ తర్వాత కూడా తన ఎనర్జీ తగ్గలేదని మరోసారి నిరూపించారు. ఈ పాట వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.మిలియన్ డాలర్ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తవగా, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ప్రమోషన్స్‌లో భాగంగా లిరికల్ వీడియోలు విడుదల చేస్తూ సినిమాపై అంచనాలు పెంచుతున్నారు.

ఇటీవల సీనియర్ నటి రాధిక నటించిన ’తాయి కిళవి’ భారీ విజయాన్ని సాధించడంతో, ఇప్పుడు రోజా రీఎంట్రీ మూవీపై కూడా కోలీవుడ్‌లో మంచి బజ్ నెలకొంది. సుదీర్ఘ విరామం తర్వాత రోజా మళ్లీ తెరపై కనిపించబోతుండటంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ రీఎంట్రీతో కోలీవుడ్‌లో రోజా మరోసారి తన సత్తా చాటుతారా అన్నది చూడాలి.




# బైకర్ ట్రైలర్‌కు ప్రభాస్ ప్రశంసలు

టాలీవుడ్ ఛార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రం బైకర్ ఇప్పటికే సినీ వర్గాల్లో సాలిడ్ బజ్ క్రియేట్ చేసింది. ఇండియాలోనే తొలి మోటోక్రాస్ రేసింగ్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా తన కాన్సెప్ట్‌తో ప్రత్యేక గుర్తింపును సంపాదించింది. తాజాగా విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలుస్తోంది.ఈ ట్రైలర్‌పై పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ స్పందించడం మరింత ఆసక్తిని రేకెత్తించింది. తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రభాస్ ‘బైకర్ ట్రైలర్ వైబ్ అదిరిపోయింది‘ అంటూ ప్రశంసలు కురిపించాడు. ట్రైలర్ చాలా ఎంగేజింగ్‌గా ఉందని, సినిమా టీమ్‌కు తన శుభాకాంక్షలు తెలియజేశాడు. ముఖ్యంగా శర్వానంద్‌తో పాటు నిర్మాణ సంస్థకు కూడా విజయాన్ని కోరుకున్నాడు. ఈ ట్రైలర్‌లో హై-ఆక్టేన్ రేసింగ్ సీన్స్, ఎమోషనల్ ఎలిమెంట్స్, ఫ్యామిలీ బ్యాక్‌డ్రాప్ అన్నీ బ్యాలెన్స్‌డ్ చూపించడం విశేషం. శర్వానంద్ పూర్తిగా కొత్త లుక్‌లో కనిపిస్తూ, రేసర్ పాత్రలో తన ట్రాన్స్‌ఫర్మేషన్‌తో ఆకట్టుకుంటున్నాడు. మరోవైపు సీనియర్ నటుడు రాజశేఖర్ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనుండటం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా మాళవిక నాయర్ నటిస్తుండగా, భారీ తారాగణం ఈ ప్రాజెక్ట్‌లో భాగమైంది. దర్శకుడు అభిలాష్ రెడ్డి ఈ చిత్రాన్ని స్టైలిష్ రేసింగ్ డ్రామాగా రూపొందిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ మూవీ టెక్నికల్‌గా కూడా హై స్టాండర్డ్స్‌తో తెరకెక్కుతున్నట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది. మోటోక్రాస్ రేసింగ్ వంటి కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ సినిమా తెలుగు ప్రేక్షకులకు ఒక ఫ్రెష్ ఎక్స్‌పీరియెన్స్ ఇవ్వనుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే ట్రైలర్‌కు వస్తున్న స్పందనను బట్టి, ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్ సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 3న గ్రాండ్‌గా విడుదల కానున్న ’బైకర్’ మూవీ, శర్వానంద్ కెరీర్‌లో ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

# ధురంధర్2 కలెక్షన్ల దూకుడు ప్రపంచవ్యాప్తంగా రూ.750 కోట్ల కలెక్షన్లు

ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటించిన స్పై థ్రిల్లర్ ’ధురంధర్ 2’ బాక్సాఫీస్ వద్ద రికార్డుల సునామీ సృష్టిస్తోంది. విడుదలైన నాలుగు రోజుల్లోనే ఈ చిత్రం చారిత్రక వసూళ్లను సాధించి, హిందీ సినీ చరిత్రలో సరికొత్త మైలురాళ్లను నెలకొల్పింది.నాలుగు రోజుల్లోనే ’ధురంధర్ 2’ ప్రపంచవ్యాప్తంగా రూ.750 కోట్ల కలెక్షన్లతో దూసుకుపోతోంది. బుధవారం జరిగిన పెయిడ్ ప్రివ్యూల ద్వారానే రూ.43 కోట్లు సాధించిన ఈ సినిమా, ఆదివారం ఒక్కరోజే దేశీయంగా అత్యధికంగా రూ.115 కోట్లు వసూలు చేసి రికార్డు సృష్టించింది. హిందీ చిత్రసీమలో షారుఖ్ ఖాన్ ’పఠాన్’ నెలకొల్పిన రూ. 287 కోట్ల ఓపెనింగ్ వీకెండ్ రికార్డును ’ధురంధర్ 2’ సునాయాసంగా అధిగమించింది. ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా రూ.180 కోట్లు వసూళ్లతో ఈ చిత్రం ప్రభంజనం సృష్టిస్తోంది. ఇకపోతే ’ధురంధర్ 2’ సంచలనం సృష్టిస్తోన్న వేళ.. ఇందులో కీలకపాత్రలో నటించిన సీనియర్ నటుడు గౌరవ్ తన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ చిత్రంలో మహమ్మద్ ఆలం పాత్రతో మెప్పించిన ఆయన తాజాగా ఓ లేఖను పంచుకున్నారు. 1998లో తాను ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలో తన తల్లిదండ్రులకు రాసిన లేఖను షేర్ చేశారు. దిల్లీ నుంచి ముంబయి వచ్చిన రోజుల్లో తన ఆర్థిక ఇబ్బందులను అందులో ప్రస్తావించారు. ‘ఇది 1998లో మా అమ్మనాన్నలకు రాసిన లేఖ. నేను ముంబయికి వచ్చి అప్పటికి నెల రోజులు కూడా కాలేదు. అప్పట్లో ఈమెయిల్‌లు లేవు, కేవలం ఉత్తరాలే. ఆ తర్వాత టీవీ, సినిమాలు, యాడ్స్, రేడియో, రీల్స్.. ఇలా ఎన్నో ఒడుదొడుకులతో నా ప్రయాణం సాగింది. అప్పట్లో నా భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలియదు కానీ, నేనెప్పుడూ ఆశను కోల్పోలేదు. నాకు అండగా నిలిచిన మా అమ్మనాన్నలకు ధన్యవాదాలు‘ అంటూ లేఖను పంచుకున్నారు. అందులో తన తల్లిదండ్రులకు అప్పటి పరిస్థితిని వివరించారు గౌరవ్. ‘ప్రస్తుతానికి డబ్బు పరంగా ఏమీ కలిసిరావడం లేదు. కానీ, త్వరలోనే మంచి జరుగుతుందని ఆశిస్తున్నాను. దిల్లీతో పోలిస్తే ఇక్కడ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఖర్చు తగ్గించుకోవడానికి నేను స్నేహితుడితో కలిసి ఓ చిన్న గదిలో ఉంటున్నాను. టెలిఫోన్, విద్యుత్, గ్యాస్, నీటి బిల్లులతో పాటు భోజనం ఖర్చులు కూడా ఇద్దరం కలిసే పంచుకుంటున్నాం. భవిష్యత్తుపై ఆశతో జీవిస్తున్నాను. కానీ నేను నేర్చుకోవాల్సింది ఇంకా చాలా ఉంది‘ అని రాసి ఉన్న లేఖ ప్రస్తుతం వైరల్ అవుతోంది. దీనిపై బాలీవుడ్ ప్రముఖులు స్పందిస్తున్నారు. పట్టుదలతో శ్రమిస్తే ఏదో ఒకరోజు గుర్తింపు లభిస్తుందంటూ ప్రశంసిస్తున్నారు.




Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD .. PRGI No- APTEL/25/A2739, Cell- 9963496956, 7382712780.